Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.12.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 26 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# ఆంధ్రుడికి అవమానం

- మెట్రో, ఇవాంక కార్యక్రమాలలో చంద్రబాబుకు అందని పిలుపు
- హైదరాబాద్‌పై హక్కున్నా లభించని భాగస్వామ్యం
- ఏపిని మరోసారి తక్కువచేసి చూసిన కేంద్రం
- ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన ప్రధాని నరేంద్ర మోడీ
- నియంతల్లా వ్యవహరించిన కేసీఆర్, కేటీఆర్



ఛార్మినార్... గోల్కొండ... సాలార్‌జంగ్ మ్యూజియం... నిజాం హాస్పిటల్... అసెంబ్లీ భవనం... చారిత్రక హైదరాబాద్ నగరం చిహ్నాలు... ట్యాంక్ బండ్... హైటెక్ సిటి... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్... ఔటర్ ఎక్స్‌ప్రెస్ హైవే... మెట్రో... ఇవన్నీ ఆధునిక హైదరాబాద్ నగర ప్రతిరూపాలు. చారిత్రక నిర్మాణాల నిర్మాతలు నిజాం నవాబులైతే, ఆధునిక నిర్మాణాల సారధులు ఆంధ్రులే! ఇందులో ఇసుమంతైనా సందేహం లేదు. ఆధునిక హైదరాబాద్ అభివృద్ధిలో ప్రధాన పాత్రధారులు ఆంధ్రా ప్రాంతపు ముఖ్యమంత్రులే!

(మిగతా 11వ పేజీలో)



- తమిళనాడును మించిపోతున్న తెలుగునాడు
- అక్కడి రాజకీయ నాయకుల హామీలు వంటబట్టించుకుంటున్న ఇక్కడి ప్రధానపార్టీల అధినేతలు

# వరాల వీరులు

మేం అధికారంలోకి వస్తే ఫ్రీ బియ్యం... ఫ్రీ కరెంట్... ఫ్రీ గ్యాస్... చదువు కునేవాళ్ళకు ల్యాప్‌టాప్‌లు... మహిళలకు మిక్సీలు, సీరియల్స్ చూడడానికి ఉచిత టీవీలు... రూపాయికే చపాతి... పావలాకే దోశ... గత తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఓ పార్టీ వారి వరాలు.

మరి ఇంకో పార్టీ వాళ్ళు వూరుకుంటారా? ఫ్రీగా బియ్యమిస్తే సరిపోతుందా? కూరలు పల్లేదా? మేం అధికారంలోకి వస్తే కూరగాయలు ఫ్రీ, ఉప్పు, పప్పుదినుసులన్నీ ఫ్రీ... ప్రభుత్వ క్యాంటీన్‌లలో టిఫిన్ ఫ్రీ... సీలింగ్ ఫ్యాన్‌లు, ఏ.సి.లు, రిఫ్రిజరేటర్లు ఫ్రీ అన్నారు.

(మిగతా 11వ పేజీలో)

- కథ అడ్డం తిరిగింది

# పోలవరం... ఇక కలవరం

## చేతులెత్తేసిన చంద్రబాబు



11లో



# ప్రాణాలను మింగుతున్న చెరువులు



అన్నెంపున్నెం ఎరుగని, ఆడుతూపాడుతూ తిరిగే ముగ్గురు చిన్నారులను చెరువు మృత్యుకౌగిలిలోకి తీసుకెళ్లింది. ముగ్గురు చెరువులో మునిగి విగతజీవులుగా మారారు. తమ బిడ్డలు ఇక లేరని తెలియడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు. ఈ హృదయ విదారక ఘటన నెల్లూరుజిల్లా దొరవారిసత్రం మండలం వడ్డికండ్రిగ గ్రామంలో గత నెల 26న చోటు చేసుకుంది. ఈ సంఘటనతో ఆనేగొట్టం, ఆనేపూడి గ్రామాల్లోని మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. పోలీసుల కథనం మేరకు ఆనేగొట్టం గ్రామానికి చెందిన కార్నా రాకేష్(14), వంకా వెంకట్‌హేమంత్(12), హరీష్, ఆనేపూడి గ్రామానికి చెందిన చొప్పల జయకృష్ణ(14) కలసి వడ్డికండ్రిక గ్రామానికి చెందిన స్నేహితుడు రాజేష్ ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి సరదాగా అందరూ కలుసుకుని గ్రామ సమీపంలోని చెరువులోకి ఈతకు వెళ్లారు. చెరువు ఒడ్డున రాజేష్, హరీష్ ఉండగా మిగిలిన ముగ్గురు విద్యార్థులు చెరువులోకి ఈత కొట్టేందుకు దిగారు. చెరువులో గ్రావెల్ గుంతలు ఉండటంతో ఈతరాని ముగ్గురూ ఒక్కసారిగా మునిగిపోయారు. ఒడ్డున ఉన్న విద్యార్థులు దిక్కుతోచక భయంతో చూస్తూ ఉండిపోయారు. మధ్యాహ్నం 12గంటలకు దుస్తులు ఉతికేందుకు కొందరు మహిళలు రాగా వారికి విషయం తెలియడంతో గ్రామానికి వెళ్ళి విషయం చెప్పారు. హుటాహుటిన వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన కొందరు యువకులు చెరువులోకి దిగి ముమ్మరంగా రెండు గంటల పాటు గాలించారు. తొలుత జయకృష్ణ మృతదేహం, అనంతరం రాకేష్, వెంకట్‌హేమంత్ మృతదేహాలను బయటకు తీసారు. అప్పటికి సంఘటనా స్థలానికి విద్యార్థుల తల్లి దండ్రులు, బంధువులు చేరుకున్నారు. విద్యార్థుల మృతదేహాలను చూసి బోరున విలపించారు. ముగ్గురు విద్యార్థులు జడ్పీ పాఠశాలలో చదువుకుంటున్నారు. తహశీల్దార్ వెంటేశ్వరరావు, ఎస్సై కోటిరెడ్డి, ఎంపిటిసి కిషోర్, సర్పంచ్ విజయ్‌నాయుడు మృత దేహాలకు నివాళులర్పించారు.

## పూలే సేవలు చిరస్మరణీయం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావ్ పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని జ్యోతిరావు పూలే, సావిత్రాబాయి పూలే విగ్రహాలకు గత నెల 28న నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి, బిసి సంక్షేమశాఖ అధికారిణి రామేశ్వరి, బిసి కార్పొరేషన్ ఇ.డి వెంకటస్వామి పూలేకు నివాళులర్పించారు. బి.సి సంక్షేమ సంఘం నాయకుడు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, కార్పొరేటర్లు ఆనం రంగమయూర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, నూనె మల్లిఖార్జునయాదవ్ తదితర బి.సి సంఘాల నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు స్వచ్ఛంధ సంస్థల నాయకులు, వివిధ పార్టీల నాయకులు జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు. నెల్లూరు బార్ అసోసియేషన్, బి.సి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఫణిరత్నం, రోజారెడ్డి, రాష్ట్ర బి.సి సంఘం నాయకులు గిద్దలూరు వెంకటనరసయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెల్లూరుజిల్లా విశ్వబ్రాహ్మణసంఘం నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు ఆచారి ఆదేశాల మేరకు పాత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ నెల్లూరుజిల్లా విశ్వబ్రాహ్మణుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈమేరకు రాష్ట్ర కార్యవర్గం గత నెల 29న ఆదేశాలు జారీ చేసింది. విశ్వబ్రాహ్మణ సంఘ నూతన అధ్యక్షుడిగా ఖాజన వెంకటశేషయ్య ఆచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెరువుగట్టు నాగబ్రాహ్మఆచారి, ప్రధానకార్యదర్శిగా ఆమూరు సీతారామయ్య ఆచారి, కోశాధికారిగా మోహన్ ఆచారి, ఉపాధ్యక్షుడిగా కైకుపల్లి కుమార్ ఆచారి ఎంపికయ్యారు.

## నేరాల నియంత్రణపై దృష్టి సారించండి

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని నెల్లూరు నగర డిఎస్పీ మురళీకృష్ణ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గత నెల 29న ఆయన 2వ నగర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసారు. స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. పలు కేసులు పెండింగ్‌లో ఉండటంతో దర్యాప్తులో ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండవనగర ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, ఎస్సై శ్రీహరిబాబు, ఏఎస్సైలు పుల్లారెడ్డి, రాజేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు...
# 'చుక్క'లు చూపిస్తున్నారు!

**తన భూమి తాను సాగుచేసుకునేందుకు, తన భూమి తాను అమ్ముకునేందుకు, తన భూమిని తాను తాకట్టు పెట్టుకునేందుకు, తన భూమికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు పొందేందుకు రైతులు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. మన రెవెన్యూ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న లోపాలు, అధికారుల పాపాలు వెరసి రైతులకు శాపాలవుతున్నాయి.**

మన రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఎంత అధ్వాన్నంగా ఉంటుందో వేరే చెప్పనక్కరలేదు. ఒకే సర్వే నెంబర్, ఒకే పొలంతో ఇద్దరికి పట్టాలుంటాయి. ఇద్దరికీ 1బిలు ఇచ్చివుంటారు. గ్రామాలలో పొలాల వద్ద గొడవలు జరిగేది, ఒకర్నొకరు కొట్టుకుని చచ్చిపోయేది ఇలాంటి వివాదాల వల్లే! రెవెన్యూ లోపాలలో ఒకటి చుక్కల భూములు. 1947కు ముందు పట్టాదారులుగా వుండి లింకు డాక్యుమెంట్లు కలిగి, శిస్తులు కట్టివున్నా కూడా రికార్డులలో చుక్కలు వున్నాయనే సాకుతో అలాంటి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. చుక్కలు వున్న భూములకు సంబంధించి మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకుంటే రైతులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. అయితే ఆచరణలో ఇది సాధ్యం కావడం లేదు. చుక్కలు వున్న భూములకు రైతులకు ఋణాలు




గాని, వ్యవసాయ సబ్సిడీలుగాని ఇవ్వడం లేదు. సాగుచేస్తున్న భూములలో చుక్కలు వున్నాయంటూ సాకు చూపి ఎగ్గొడుతున్నారు. 'డాట్స్' వున్న భూములను ప్రభుత్వం అవసరమైతే సేకరించవచ్చు. అయితే రైతులకు ప్రత్యామ్నాయ భూములను చూపించాల్సివుంది.

గ్రామాలలో పొలాలు చేతులు మారడం సహజం. ఒకరి నుండి ఒకరు కొనుగోలు చేస్తుంటారు. పొలాలు చేతులు మారి రిజిష్టర్ చేసుకున్నా కూడా 1బిలో పాత పేర్లే వస్తున్నాయి. అడంగల్, పాస్‌బుక్‌లు కొనుగోలు చేసిన వారి పేర్లతో మారినా 1బిలలో పేర్లు మారడం లేదు. భూమి యాజమాన్య హక్కుకు ఇప్పుడు 1బిలే కీలకం కావడంతో రైతులు ఆ దిశగా కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక పిత్రార్జితం భూములు కొనుగోలు చేస్తే... అడంగల్‌లోనూ ఇదే వస్తుంది.

రికార్డులలో లోపాల వల్ల భూముల వివరాలు సరిగా నమోదు కాకపోతుండడం వల్ల ఋణాలు పొందడంలో గాని, వ్యవసాయ సబ్సిడీలను వినియోగించుకోవడంలో గాని రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆఖరకు రెవెన్యూ రికార్డుల లోపాల వల్లే చాలామంది రైతులు ఋణ మాఫీకి అర్హులు కాకుండా పోయారు.

సింహపురి సమాచారం

## 2 నుంచి శ్రీనివాస కళ్యాణాలు

తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాస కళ్యాణం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 2 నుంచి 13వ తేదీ వరకు నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 10 ప్రాంతాల్లో శ్రీనివాస కళ్యాణాలు జరుగనున్నాయి. నెల్లూరుజిల్లాలో డిసెంబర్ 2వ తేదీన కలువాయి మండలం చింతలపాలెంలో, 3న రాపూరు మండలం చెట్టుపాలెంలో, 4న సంగం మండలం తుళ్ళుకూరుపాడులో, 5న నెల్లూరు సమీపంలోని పల్లిపాడులో, 6న విడవలూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీవారి కళ్యాణాలు నిర్వహించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో డిసెంబర్ 9న టి.నరసాపురం మండలం నాయకులగూడెంలో, 10న కమవరపుకోటలో, 11న చింతలపూడిలోని జడ్పి ఉన్నతపాఠశాల మైదానంలో, 12న దేవరపల్లిలోని జడ్పి ఉన్నత పాఠశాల మైదానంలో, 13న గోపాలపురం మండలం దొండపూడిలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీనివాస కళ్యాణాలు జరగనున్నాయి. కళ్యాణాలు సాయంత్రం 6గంటల నుంచి ప్రారంభమవుతాయి. కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సంకీర్తనా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## పాఠశాలలకి నిధులు మంజూరు చేయండి

**- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి**

నెల్లూరుజిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని మున్సిపాలిటి, ఆరు మండలాల పరిధిలోని పాఠశాలలు దుస్థితిలో ఉన్నాయని, వాటి అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన కోసం రూ.40.64కోట్లు మంజూరు చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ వ్రాసారు. ఈమేరకు గత నెల 25న ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన పల్లెబాటలో పాఠశాలల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ఆయా మండలాల విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో చర్చించానన్నారు. దీంతో అన్ని మండలాల్లో అదనపు తరగతి గదులు 166, కార్యాలయ గదులు 31, లైబ్రరీ గదులు 29, ల్యాబరేటరీ గదులు 28, కంప్యూటర్ గదులు 28, ప్రధానోపాధ్యాయుల గదులు 31, మరుగుదొడ్లు 39 నిర్మించాల్సి వుందన్నారు. తాగునీటి వసతి ఫర్నీచర్ కొనుగోళ్ళు తదితర అభివృద్ధి పనుల కోసం అంచనాలు తయారు చేయడం జరిగిందన్నారు. మొత్తం రూ.40.64 కోట్లు వ్యయం కానుందన్నారు. త్వరలో నిధుల మంజూరు విషయమై కలెక్టర్‌ను కలవనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మే నెల్లో చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు

ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలను 2018 మే నెలలో నిర్వహించాలని ఆలయ పాలకమండలి నిర్ణయించింది. చెంగాళమ్మ ఆలయ ఆవరణంలోని దేవస్థానం కార్యాలయంలో ఆలయ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి అధ్యక్షతన గత నెల 29న పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. అమ్మవారి గర్భాలయం గోడలకు దాతల సహకారంతో బంగారు రేకుతో తాపడం చేయించాలని నిర్ణయించారు. నూతన సంవత్సరం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. 2018 ఫిబ్రవరిలో పుష్పయాగం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు చిట్టేటి పేరుమాళ్ళు, అలవల సూరిబాబు, పిట్ల సుహాసిని, ముప్పాళ్ల విజయలక్ష్మి, ఆకుతోట రమేష్, పులుగు శ్రీనివాసులు, వేనాటి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు రోటరీ ఫర్నీచర్

గూడూరు పట్టణంలోని జిఎస్ఆర్ పురపాలక పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రంథాలయానికి సంబంధించిన బెంచీలు, కుర్చీలు ఇతర సామాగ్రిని దాతలు సుబ్రహ్మణ్యం, భవానీల సహకారంతో ఇటీవల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు మునిరాజా, కార్యదర్శి బాలకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొనేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, నేటి ఆధునిక యుగంలో పుస్తకాల వల్ల విజ్ఞానం అందించేందుకు లైబ్రరీలు కీలకమని చెప్పారు. ప్రతిఒక్కరూ దాతలు చేస్తున్న సేవలను వృధా కానివ్వకుండా బాగా చదువుకునేందుకు పునాదులు వేసుకోవాలని కోరారు. విద్యతోనే మానవునికి విలువ పెరుగుతుందని చెప్పారు. అనంతరం బెంచీలు, కుర్చీలను అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కె.మునిగిరీష్, జానకిరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, ఎన్.వి.రత్నం, నాగేంద్రప్రసాద్, కృష్ణయ్య, జీజీనాయుడు, ప్రధానోపాధ్యాయులు మున్వర్‌భాషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గురువుకు వందనం



నెల్లూరు జిల్లా విద్యా కుసుమం, రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం మాస్టారును ఆయన పూర్వ శిష్యుడు, అమెరికాలో ప్రముఖ కార్డియాలజిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ కేశవరెడ్డి ఇటీవల నెల్లూరుకు వచ్చి తన గురువును కలుసుకున్నారు. నెల్లూరు దర్గామిట్టలోని రత్నం జూనియర్ కళాశాలను సందర్శించిన కేశవ రెడ్డి, తరగతి గదికి వెళ్ళి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రత్నం మాస్టారు చాలా గొప్పవారని, ఆయన నేర్పిన క్రమశిక్షణ, విద్యా బోధనతోనే తాను ఈ స్థాయిలో వున్నానని, రత్నం విద్యాసంస్థల్లో చదివే ప్రతి ఒక్కరూ ప్రయోజకులవుతారని ఆయన చెప్పారు. డాక్టర్ కేశవరెడ్డిని ఈ సందర్భంగా రత్నం మాస్టారు పుష్పగుచ్ఛంతో అభినందించారు.

# ఆఘమేఘాలపై పరుగెత్తిన అజీజ్

దాదాపు 20రోజులకు పైగా నెల్లూరు ప్రజలకు అందుబాటులో లేకుండా అమెరికాకు పోయిన మేయర్ అబ్దుల్ అజీజ్, ఇన్‌ఛార్జ్ మేయర్‌గా డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ బాధ్యతలు చేపట్టాడని తెలియగానే ఆఘమేఘాల మీద తిరిగొచ్చాడు. తాను ఎక్కడికి వెళుతున్నదీ అధికారికంగా తెలపకుండానే అజీజ్ అమెరికాకు వెళ్ళడం జరిగింది. ఆయన అమెరికాలో వున్న సంగతి వైకాపా నేతలు సాక్ష్యాలతో సహా బయటపెట్టడంతో డిప్యూటి మేయర్‌గా వున్న ముక్కాల ద్వారకానాథ్‌కు ఇన్‌ఛార్జ్ మేయర్ బాధ్యతలు ఇవ్వాల్సిన పరిస్థితి రావడంతో కార్పొరేషన్‌లో పరిస్థితి చేయి దాటిపోతుందని అజీజ్ వెంటనే పరుగెత్తుకుంటూ వచ్చాడు.

# నడవండి... సమాజాన్ని నడిపించండి

## • ఉత్సాహంగా వాకర్స్ అవార్డుల ప్రదానోత్సవం



మనోహర్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

సమాజసేవలో వాకర్స్ తమ వంతు పాత్ర పోషించాలని, వాళ్ళు ముందుకు నడవడమేకాక, ప్రజలను కూడా ముందుకు నడిపించాలని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు నడపాలని మాజీ శాసనసభ్యులు, రాజధాని నిర్మాణ కమిటి సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. గత నెల 26వ తేదీ నెల్లూరు అపోలో హాస్పిటల్ ఎదురుగా వున్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వాకర్స్ సదస్సు మరియు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వనరులకు కొదవలేదని, ఆ వనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై వుందన్నారు. ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకుని నిరుద్యోగులు వాటిపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం వాకర్స్ రచించిన వాక్‌జీవన దీపిక అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 70మందికి వారి విశిష్ట సేవలకు గాను ఉత్తమ వాకర్స్ అవార్డులు ఇచ్చారు. వాకర్స్ జీవిత సాఫల్య అవార్డును బిరుదవోలు రామిరెడ్డికి, బెస్ట్ వాకర్స్ క్లబ్‌గా ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్‌కు, బెస్ట్ ట్రెజరర్‌గా జడ్పీ వాకర్స్ ఆంజనేయులుకి, మూడు జిల్లాల పరిధిలో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్ విఆర్సీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డికి, ఉత్తమ మహిళా వాకర్‌గా వీఆర్సీ క్లబ్‌కు చెందిన అనూరాధకు అవార్డులు ఇచ్చారు. వాకర్స్ గవర్నర్-203 మైథిలి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం ఎంతో విజయవంతంగా జరిగింది. వాకర్స్ గవర్నర్‌గా మూడుజిల్లాల పరిధిలో ఎన్నో వాకర్స్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తూ వాకింగ్ పట్ల ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ ప్రతిఒక్కరి జీవితాలలో వాకింగ్‌ని ఓ భాగం చేయడంలో అలుపెరుగని కృషి చేస్తున్న బి.మనోహర్‌రెడ్డి దంపతులను ఈ సందర్భంగా సభలో ఘనంగా సన్మానించారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వాకర్స్ అధ్యక్షుడు చెలికం సీతారామయ్య, వాకర్స్ డిస్ట్రిక్ట్-203 రామకృష్ణా రెడ్డి, వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ యం.వి.సుబ్బారెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, ఖాజావలి, శింగంశెట్టి మురళీమోహన్ రావు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.



అవార్డులందుకున్న ఉత్తమ వాకర్స్

## వాకర్స్ నిధికి బీద విరాళం

వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలలో తన భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటూ బీద మస్తాన్‌రావు లక్ష రూపాయలను వాకర్స్ అసోసియేషన్‌కు విరాళంగా అందజేశారు. భవిష్యత్తులో కూడా అసోసియేషన్‌కు తనవంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

# ప్రజలకు సంపూర్ణ సహకారం

## - పాలకవర్గ సమావేశంలో డిసిసిబి చైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని, జాతీయ బ్యాంకులకు ధీటుగా అన్ని సేవలు అందిస్తామని డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. గత నెల 29న నెల్లూరు ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ సెంటర్‌లోని బ్యాంక్ ఆవరణంలో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా ఇప్పటివరకు ఇస్తున్న పంట రుణాల పరిమితిని రూ.లక్ష నుంచి రూ. 3లక్షలకు పెంచామని, మెట్టప్రాంత రైతులకు ఎకరానికి రూ.2లక్షలు, మాగాణి పొలానికి రూ.3లక్షలు రుణాలుగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు. బ్యాంక్ ద్వారా వ్యక్తిగత క్రెడిట్ లిమిట్ పద్ధతిలో పంట రుణాలు మంజూరు, స్వల్పకాలిక రుణాలకు రూ.200కోట్లు, దీర్ఘకాలిక రుణాలకు రూ.25కోట్లు అందించేందుకు తీర్మానించామని తెలిపారు. నెల్లూరుజిల్లా నాయుడుపేటలో నూతన బ్యాంకు భవన నిర్మాణం చేపట్టడం, బంగారంపై ఇచ్చే రుణాల వడ్డీని 10శాతంతో గ్రాముకు రూ.1900 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.234కోట్లు డిపాజిట్లు సేకరించామన్నారు. అత్యధిక వడ్డీ రేటు ఇస్తున్న శతవర్ష డిపాజిట్ స్కీంను వచ్చే ఏడాది జనవరి 17వ తేదీ వరకు పొడిగించామన్నారు. నెల్లూరు నగరంలోని రామమూర్తినగర్, ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు గూడూరు, ఆత్మకూరు శాఖల్లో నూతన ఏటిఎం సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. దీర్ఘకాలిక రుణాలపై ఉన్న వాల్యుయేషన్ ఫీజును ఒక్కశాతం నుంచి 0.5శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత రుణాల పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడంతో పాటు వడ్డీ రేటును 15శాతం నుంచి 13.75 శాతానికి తగ్గించామన్నారు. వ్యాపార అవసరాల నిమిత్తం చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు రూ.5లక్షల వరకు ఇచ్చే రుణాలకు 13శాతం వడ్డీని వసూలు చేసేందుకు నిర్ణయించామని, గొర్రెల కొనుగోలుకు రుణాలు ఒక యూనిట్ నుంచి 2యూనిట్లకు పెంచామన్నారు. అసైన్‌మెంట్ భూముల రైతులకు గ్రూపు లోనింగ్ ద్వారా ఒక్కొక్కరికి రూ.లక్ష వరకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ బ్యాంకు ద్వారా ట్రాక్టర్ రుణాలు పొంది సకాలంలో వాయిదాలు చెల్లించిన 430 మంది రైతులకు 2శాతం వడ్డీ రాయితీ కింద రూ.20.66 లక్షలు నగదును చెల్లిస్తున్నామన్నారు. బ్యాంక్ వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు కోడూరు కమలాకర్‌రెడ్డి, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, ఏరువ కృష్ణయ్య, సిఇఓ వై.సరిత, ఏజిఎం దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



# 'ప్రభా'తం

కాంగ్రెస్ ముక్త భారత్ నా లక్ష్యం అని ప్రధాని నరేంద్రమోడీ ఓ పక్క కంకణం కట్టుకుని పని చేస్తున్నాడు. దేశ రాజకీయ చరిత్రలో ఇంతవరకు తాముంటున్న పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిన నాయకులను చూసాం, కాని తొలిసారిగా ఇంకో పార్టీ పతనం కోసం పని చేస్తున్న నాయకుడిగా నరేంద్ర మోడీని చూస్తున్నాం. ప్రధాని అయ్యాక ఆయన ప్రసంగాలు గమనిస్తే... తనను ప్రధానిని చేసిన భారతీయ జనతాపార్టీ పేరు కంటే ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీ పేరునే ఆయన ఎక్కువసార్లు ఉచ్ఛరించి వుంటారు. ఆయన ఇంకోసారి బీజేపీని ఎలా అధికారంలోకి తీసుకురావాలా అని ఆలోచించడం లేదు. ఒక్కో రాష్ట్రం నుండి కాంగ్రెస్‌ను ఎలా వెళ్లగొట్టాలా అని మాత్రమే చూస్తున్నాడు.

అయితే ఇది కాంగ్రెస్‌కు ఓ రకంగా మంచి పరిణామం కూడా! తాను లేదా తన సంస్థ అభివృద్ధి చెందాలని ఏ వ్యక్తి అయినా కృషి చేస్తే దానికి తగ్గ ఫలితాలుంటాయి. తన వృద్ధి కోసం కాకుండా అవతలి వారి పతనం కోసం ఎక్కువ శ్రమ పడితే అది వృధా ప్రయాస కాక తప్పదని చరిత్రే ఋజువు చేస్తుంది. కాంగ్రెస్ పతనం కావాలంటే నరేంద్ర మోడీ అందుకు అధికార శక్తియుక్తులన్నింటిని ప్రయోగించాల్సిన అవసరం లేదు. ప్రధానంగా నరేంద్రమోడీ దేశ ప్రజలు మెచ్చేలా సత్ఫలితాలు చూపిస్తే, నోట్ల రద్దు, జిఎస్టీ వంటి బాదుడు కార్యక్రమాలు కాస్త తగ్గిస్తే కాంగ్రెస్‌ను ఆయన నిర్వీర్యం చేయడం కాదు... దానంతట అదే నిర్వీర్యమవుతుంది. మూడున్నర దశాబ్దాల క్రితం దేశంలో కాంగ్రెస్ తప్ప ఇంకేమీ వుండేవి కావు. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ శతకోటి లింగాలలో ఒక లింగమైపోయింది. కర్నాటకలో తప్ప ఏ ఒక్క పెద్ద రాష్ట్రం కూడా కాంగ్రెస్ చేతిలో లేదు. ఇండియా మ్యాప్ మొత్తం కాషాయం విస్తరిస్తోంది. అక్కడక్కడా కొన్ని ప్రాంతీయపార్టీలు గట్టిగా నిలబడ్డం వల్ల బీజేపీ విస్తరణకు ఆటంకం కలుగుతోంది.

## కాంగ్రెస్‌ను కాపాడేనా?



**దేశంలో ఒకప్పుడు కాంగ్రెస్ వున్న స్థానంలో ఇప్పుడు బీజేపీ వుంది. బీజేపీ వ్యతిరేక ఓటు మీదే కాంగ్రెస్, ఇతర వ్యతిరేక పార్టీల మనుగడ ఆధారపడి వుంది. గతంలో కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లన్నీ వివిధ పార్టీల మధ్య చీలేవి. ఇప్పుడు బీజేపీ వ్యతిరేక ఓట్లను ఆయా పార్టీలు చీల్చుకుంటున్నాయి. కాంగ్రెస్‌ను నిలబెట్టాలంటే రాహుల్‌కు ముందు దేశం గురించి, దేశంలోని ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ స్థితిగతుల గురించి తెలిసుండాలి. బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకతాటిపైకి తెచ్చే తెలివితేటలుండాలి.**

దేశంలో బీజేపీ అత్యంత బలీయశక్తిగా తయారైన నేటి రాజకీయ పరిస్థితుల్లో మరి కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి ఏంటి? ఆ పార్టీ బ్రతికి బట్టకడుతుందా? పూర్వవైభవం సంతరించుకుంటుందా? ఆ పార్టీకి జవసత్వాలు నింపేదెవరు? ఇలాంటి ప్రశ్నలెన్నో నేడు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. కాంగ్రెస్‌కు ఉన్న ఒకే ఒక తురుపుముక్క రాహుల్‌గాంధీ. సోనియాగాంధీ నాయకత్వం వహించే పరిస్థితి దాటిపోయింది. ఆమె నేతృత్వంలో కాంగ్రెస్ రెండుసార్లు అధికారంలోకి రాగలిగింది. యూపిఏ-2లో జరిగిన స్కాముల పాపాలకు 2014 ఎన్నికల్లో దేశ ప్రజలు కాంగ్రెస్‌ను ఛీదరించుకున్నారు. గత కొన్ని దశాబ్దాలలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా కాంగ్రెస్ తన గోతిని తానే తీసుకుంటూ వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ సెల్ఫ్ సూసైడ్‌ను ప్రత్యక్షంగా చూసాం. ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పునరుజ్జీవం పొందే సూచనలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో త్వరలోనే కాంగ్రెస్ సారధిగా రాహుల్‌గాంధీకి బాధ్యతలు కట్టబెట్టే ప్రయత్నాలు శరవేగంగా జరుగుతున్నాయి. బహుశా గుజరాత్ ఎన్నికలలోపే ఆ ముహూర్తం కూడా ఉండొచ్చు. గుజరాత్ ఎన్నికల్లో వచ్చే ఫలితాలు దేశ భవిష్యత్ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. గుజరాత్‌లో గెలుపే లక్ష్యంగా అటు బీజేపీ ఇటు కాంగ్రెస్ పోరాడుతున్నాయి. ఇక్కడ బీజేపీ ఓడిపోవడం అంటూ జరిగితే మోడీ చాపక్రిందకు నీళ్ళు చేరడమే అవుతుంది. ఇక్కడ గెలిస్తే కొనఊపిరితో వున్న కాంగ్రెస్‌కు చివరి క్షణంలో శ్వాసను అందించి బ్రతికించినట్లే అవుతుంది. గుజరాత్‌లో బీజేపీ ఓడిపోవడం అంటూ జరిగితే అన్ని రాష్ట్రాల్లో కూడా ఆ పార్టీకి డౌన్‌ట్రెండ్ మొదలైనట్లే! అదే సమయంలో కాంగ్రెస్ పుంజుకోవడానికి అవకాశమిచ్చినట్లే! రాజకీయాలలో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవు. ఇలాంటి పరిణామాలే కేంద్రప్రభుత్వంలో చోటు చేసుకుంటున్నాయి. ప్రధానిగా మోడీ దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయించేంతటి కార్యక్రమాలేవీ చేపట్టలేదు. వాజ్‌పేయి హయాంలో చేపట్టిన స్వర్ణచతుర్భుజి పథకంతోనే దేశంలో ఆర్థిక వ్యవస్థ ఎంతో ప్రేరణపొందింది. అన్ని రంగాలలోనూ మంచి ఫలితాలు వచ్చాయి. ఈ మూడున్నరేళ్ళలో నరేంద్రమోడీ అలాంటి కార్యక్రమాన్ని ఒక్కటీ చేపట్టలేకపోయాడు, సరికదా నోట్ల రద్దు, జిఎస్టీలతో కొన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. అయితే ఆ వ్యతిరేకత ఓట్ల రూపంలోకి ఎంతవరకు మారుతుందన్నదే ప్రశ్న!

పార్టీ నాయకత్వం విషయంలోకి వస్తే నరేంద్ర మోడీ ముందు రాహుల్ చాలడం లేదు. మోడీ మాటల మాంత్రికుడు. ప్రపంచ దేశాలు తిరిగాడు. దౌత్య విజయాలు సాధించాడు. అన్నింటికి మించి ఈ మూడున్నరేళ్లలో ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ గాని, ఒక్క కుంభకోణం గాని లేదు. ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తోంది. అయితే జిఎస్టీ, నోట్ల రద్దు పార్టీకి ప్రతికూలంగా మారిన వాతావరణం కనిపిస్తోంది. బీజేపీ వైఫల్యాల ఆధారంగానే ఇక దేశంలో కాంగ్రెస్ ఎదగాల్సి వుంటుంది. ఒకప్పుడు దేశంలో కాంగ్రెస్ వ్యతిరేక ఓటు మీద ప్రతిపక్ష పార్టీ ఆధారపడి ఉండేది. కాంగ్రెస్‌ను పడగొట్టడానికి దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నీ కలిసి కూటమి కట్టేవి. దేశ చరిత్రలో ఇప్పటికీ కేంద్రంలో సింగిల్ పార్టీ రూలింగ్ ఘనత కాంగ్రెస్‌దే! కాంగ్రెసేతర ప్రభుత్వాలన్నీ కూడా కలగూరగంప లాంటి పార్టీల కలయికతో ఏర్పడిన ప్రభుత్వాలే! దేశంలో ఒకప్పుడు కాంగ్రెస్ వున్న స్థానంలో ఇప్పుడు బీజేపీ వుంది. బీజేపీ వ్యతిరేక ఓటు మీదే కాంగ్రెస్, ఇతర వ్యతిరేక పార్టీల మనుగడ ఆధారపడి వుంది. గతంలో కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లన్నీ వివిధ పార్టీల మధ్య చీలేవి. ఇప్పుడు బీజేపీ వ్యతిరేక ఓట్లను ఆయా పార్టీలు చీల్చుకుంటున్నాయి.

ఒకప్పుడు మైనార్టీలు మూకుమ్మడిగా కాంగ్రెస్‌కు ఓట్లేసే వాళ్ళు. ఇప్పుడు దేశంలో లౌకికవాదమని చెప్పుకునే పార్టీలు ఎక్కువయ్యాయి. ఆ పార్టీల మధ్య కాంగ్రెస్ ఓటు బ్యాంకు చీలిపోతూ వచ్చింది. కాంగ్రెస్ పతనావస్థకు ఇది కూడా ఒక కారణం.

కాంగ్రెస్‌ను నిలబెట్టాలంటే రాహుల్‌కు ముందు దేశం గురించి, దేశంలోని ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ స్థితిగతుల గురించి తెలిసుండాలి. బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకతాటిపైకి తెచ్చే తెలివితేటలుండాలి. బీజేపీ బలమైన శత్రువు... ఆ పార్టీని ఢీ కొట్టాలంటే రాహుల్ చాలడు. దేశంలో మరికొంతమంది రాజకీయ యోధులను సమీకరించి రేపటి ఎన్నికల యుద్ధానికి ఆయన సిద్ధం కావాల్సివుంది.

# పంచాయితీలు బలోపేతం

### పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ బి.రామాంజనేయులు

రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయితీకి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను, ఒక రిసోర్స్ పర్సన్‌ను నియమించాలనే ప్రతిపాదన పరిశీలనలో వుందని పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ బి.రామాంజనేయులు తెలిపారు. గత నెల 25వ తేదీ నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశమందిరంలో పంచాయితీ రాజ్ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, గృహనిర్మాణం, గ్రామీణ నీటి సరఫరా, ఐ.సి.డి.ఎస్., తదితర శాఖల కార్యకలాపాలను సమీక్షించి మాట్లాడుతూ పంచాయితీలను బలోపేతం చేయాలని, వివిధ శాఖల అభివృద్ధికి పంచాయితీలు కేంద్ర బిందువుగా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామస్థాయిలోనే అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాల డేటాను పొందుపరచాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం పంచాయితీలలో వున్న ఇ.ఓ. ఆర్.డిలకు సహాయంగా ఒక సహాయ డేటా ఆపరేటర్‌ను కేటాయిస్తామని ఆయన వెల్లడించారు. ఉపాధిహామీ పథకంలో అనేక ప్రాంతాల్లో కొన్ని అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని,




బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని రామాంజనేయులు స్పష్టం చేశారు. అంతకుముందు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.ఎం.డి. ఇంతియాజ్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కమిషనర్‌కు వివరించారు. జిల్లా పంచాయితీ, అధికారి, తదితర అధికారులు దృశ్య, శ్రవణ చలనచిత్రం ద్వారా జిల్లాలో తమ తమ శాఖల అభివృద్ధిని ప్రదర్శించారు.

# వ్యాపారి ఇంట్లో భారీచోరీ

నెల్లూరు మాగుంట లే అవుట్ సరస్వతినగర్‌లో నివాసం ఉండే మద్యం వ్యాపారి డి.వెంకటసుబ్బారెడ్డి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వారు స్వగ్రామమైన కడపలో ఉంటున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని సుమారు రూ.3లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించుకువెళ్ళారు. గతనెల 24వ తేదీ రాత్రి నెల్లూరు వచ్చిన వెంకటసుబ్బారెడ్డి చోరీని గుర్తించి నెల్లూరు నాల్గవ నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భక్తవత్సలనగర్‌లో మరో చోరీ

నెల్లూరు భక్తవత్సలనగర్‌లో కాపురముండే పి.భార్గవ్ గత నెల 19న తన కుటుంబ సభ్యులతో కలసి బెంగుళూరులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని రూ.10వేలు విలువైన బంగారు ఉంగరం, వెండి గిన్నెలను అపహరించుకెళ్లారు. గత నెల 25న ఇంటికి వచ్చిన బాధితులు చోరీని గుర్తించి అయిదవ నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సిగ్గు లేని బతుకులు

చంద్రబాబుకు ఎమ్మెల్యేల దాహం తీరినట్లు లేదు. వైసిపి ఎమ్మెల్యేలను ఇంకా కొంటూనే వున్నాడు. జగన్మోహన్‌రెడ్డి పుణ్యాన ఎమ్మెల్యే అయిన గిడ్డి ఈశ్వరి కూడా తెలుగుదేశంలోకి పోయింది. మనిషన్నాక ఎవరయినా కొంచెం సిగ్గు, ఆత్మాభిమానాలతో బతకాలి. పార్టీ నచ్చక ఇంకో పార్టీలోకి పోవాలనిపిస్తే ఆ పార్టీ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేసి పోవాలి. ఏ మాత్రం సిగ్గు శరం లేకుండా పార్టీలు మారుస్తున్న ఇలాంటి వాళ్ళను చూస్తుంటే వీళ్ళకన్నా ఖూనీకోర్లు నయమనిపిస్తుంది.

**కె.సుజాత, హైదరాబాద్.**

## స్వేచ్ఛ కంటే మనోభావాలు ముఖ్యం

ప్రజల మనోభావాల కంటే ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛ ముఖ్యం కాదు. మనిషి తనంతట తాను స్వేచ్ఛగా బతకడానికి రాజ్యాంగం స్వేచ్ఛను కల్పించింది. అంతేగాని ఆ స్వేచ్ఛతో ఇతరుల మనోభావాలను దెబ్బతీయమని కాదు. వ్యక్తిగత స్వేచ్ఛకు కొన్ని పరిమితులుంటాయి. రచయితలకు స్వేచ్ఛనిస్తే అభూతకల్పనలు రాయమని కాదు. ఉన్నది ఉన్నట్లు వ్రాయమని. 'పద్మావతి' సినిమాపై కొందరి వాదనలు విడ్డూరంగా వుంటున్నాయి. రాజ్‌పుత్‌లు గౌరవించే రాణి పద్మిని చరిత్రను వక్రీకరించి తీసిన సినిమాను పలు రాష్ట్రాలు నిషేధించాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మనోభావాలను గౌరవించాయి. ప్రజల మనోభావాలను దెబ్బతీసే ఏ చర్యలను కూడా ఎవరూ సమర్ధించకూడదు.

**సి.రాజీవి, నెల్లూరు.**

## ఆంధ్రా ద్రోహి నల్లారి!




ఆంధ్రప్రదేశ్ విభజనకు ప్రధాన కారకుడు మాజీముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి. ఏ.పి ప్రజలను వంచించిన నయవంచకుడు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర విభజన జరగదని నమ్మబలుకుతూ విభజనకు మార్గం చూపిన విశ్వాసఘాతకుడు. అప్పట్లో కేంద్రం విభజన ప్రకటన చేసిన రోజునే ఆయన శాసనసభను రద్దుచేసి వుంటే అసలు విభజన జరిగి వుండేదే కాదు. సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్ ఈ రాష్ట్రానికి చేసిన ద్రోహానికి తనవంతు సహకారం అందించాడు. అలాంటి కిరణ్‌కుమార్‌రెడ్డి సోదరుడు కిషోర్‌కుమార్‌రెడ్డిని పార్టీలో చేర్చుకున్న చంద్రబాబు ఇంకా పెద్ద ద్రోహమే చేసాడు. రాష్ట్రం విడిపోకుండా చూడడానికి కిరణ్‌కుమార్‌రెడ్డి, తాము విశ్వ ప్రయత్నం చేసామని పెద్ద అబద్ధం చెప్పాడు. రాష్ట్ర విభజనకు చంద్రబాబు లెటర్ ఇవ్వడం నిజం కాదా? ఏ.పి ద్రోహులందరూ ఒక్క చోట చేరారు.

**జె.డేవిడ్ దిలీప్, నెల్లూరు.**



## ● నెల్లూరు నగరంలో రాజకీయ చదరంగం

# మంత్రి పోటీలో లేకుంటే.. మేమే...



**నెల్లూరు నగరం నుండి మంత్రి నారాయణ పోటీ చేస్తే... గెలుపు ఆయనదే! నెల్లూరు నగర టీడీపీ నాయకుల స్టేట్‌మెంట్ ఇది. ఇది పైకి మాత్రమే! ఆయన పోటీ చేయకుంటే మాత్రం సీటు మాకే ఇవ్వాలి. ఇదీ నాయకుల మనసులోని మాట. సీటును ఆశిస్తున్న నాయకులందరూ పైకి నారాయణ వస్తే తిరుగులేదని చెబుతున్నా లోపల మాత్రం ఆయన రాకుంటే బాగుండనుకుంటున్నారు.**



2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి నగర ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. వచ్చే ఎన్నికలలోనూ ఆయన సీటుకు పోటీలో ఉంటాడనడంలో డౌట్ లేదు. 2014 ఎన్నికలలోనే నెల్లూరు సిటీ సీటు కోసం తీవ్రంగా ప్రయత్నించిన 'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా మళ్ళీ సీటు కోసం పోరాడకుండా ఉండడు. తెలుగు దేశం పార్టీలో చేరినప్పటి నుండి మేయర్ అబ్దుల్ అజీజ్ నెల్లూరు నుండి నేను పోటీ చేస్తానంటూ పాటపాడుతూనే వున్నాడు. ఇక నగరంలో సొంత వర్గం కలిగిన ఆనం కుటుంబం నుండి ఒకరు ఈసారి ఈ సీటును ఆశించడంలో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. అయితే ప్రతి ఎన్నికలలోనూ జిల్లాలో ఒక సీటును మహిళలకు ఇస్తున్నారు. 2014 ఎన్నికల్లో గూడూరు సీటు నుండి మహిళా అభ్యర్థిగా బి.జ్యోత్స్నలతను నిలబెట్టారు. ఈసారి అక్కడ జంపింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కే సీటు ఇవ్వొచ్చు. కాబట్టి నెల్లూరు నగరంలో మహిళకు అవకాశం కల్పించవచ్చనే దిశగా మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ కూడా రంగంలో వున్నట్లు తెలుస్తోంది. ఎవరికివాళ్ళు మంత్రి నారాయణను క్రాస్ చేసి కాకుండా ఆయన అండదండలతోనే సీటు సాధించాలనుకుంటున్నారు.







## పేదోడికి...

# ధరాఘాతం

నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేక అల్లాడుతున్నారు. ఎన్నడూలేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. కోడిగుడ్లు మొదలుకుని, ఉల్లిపాయలు, చింతపండు ధరలు కొండెక్కి కూర్చున్నాయి. నూనెలు కూడా ఎక్సైజ్ సుంకం రెట్టింపవడంతో కిలోపై సుమారు రూ.10లు పెరిగి సామాన్య ప్రజలు మూడుపూటలా తినే పరిస్థితి లేదు. దీంతో ఒక్కొక్క కుటుంబంపై ప్రతినెలా అదనపు భారం పడుతోంది. చింతపండు కర్ణాటకలోని తుమ్‌కూరు, హిందూపూర్ తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తుంటారు. ప్రస్తుతం అక్కడ కొత్తపంటకు, పాత పంటకు మధ్య రోజులు కావడంతో ఇలా ఒక్కసారిగా ధరలు గణనీయంగా పెరిగాయి. దిగుమతులు చేసుకునే నూనెలకు ఎక్సైజ్ డ్యూటి రెట్టింపు కావడంతో కిలో నూనెపై దాదాపు రూ.10లు పెరిగింది. దిగుమతులు చేసుకునే నూనెలపై గతంలో ఎక్సైజ్ డ్యూటి 12.5శాతం ఉండగా ఇటీవల అది రెట్టింపు 25శాతానికి చేరుకుంది. దీంతో పామాయిల్, రీఫండ్ ఆయిల్స్‌తో పాటు ఇతర అన్ని రకాల నూనెల ధరలు పెరిగాయి. అదేవిధంగా కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో పేద మధ్య తరగతి ప్రజల జీవన విధానం భారంగా మారింది. గత నెలలో రూ.4.50 ఉన్న కోడిగుడ్డు ప్రస్తుతం రూ.6.50కు చేరుకుంది. పెరిగిన ధరలతో ప్రజలు ఏం కొని, ఏం తినాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## కురుగొండ్లకు...

# టిక్కెట్ గండం

2014 ఎన్నికల్లో ఈ జిల్లాలో తెలుగుదేశంపార్టీ మూడు సీట్లే గెలవగా అందులో వెంకటగిరి ఒకటి. ఆ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఇంకొంచెం కష్టపడివున్నా, ఆర్థికంగా ఇంకొంత ఉత్సాహం చూపివున్నా ఫలితం వేరుగా వుండేది. నియోజకవర్గంలోని ఇతర మండలాలలో వైకాపా ఆధిక్యం చూపినా వెంకటగిరి పట్టణంలో తెలుగుదేశంకు గట్టి పట్టుంది. ఇక్కడున్న బలంతోనే ఆ ఎన్నికల్లో కురుగొండ్ల గెలవగలిగాడు. అదీగాక, ఆ ఎన్నికలప్పటికి అతను సిటింగ్ ఎమ్మెల్యే. ప్రజల్లో ఆయన పట్ల పెద్దగా వ్యతిరేకత లేకపోవడం ఆయన గెలుపుకు దోహదపడింది. అదీగాక కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వైకాపా ఓట్లను చీల్చి కురుగొండ్లకు పరోక్ష సహకారం అందించాడు.

జిల్లాలో ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు గెలిస్తే ముగ్గురి మీద కూడా వారి వారి నియోజకవర్గాల్లో వ్యతిరేకత వుందని తెలుస్తోంది. ఈ వ్యతిరేకత కురుగొండ్ల రామకృష్ణ మీద కాస్త ఎక్కువగా వున్నట్లు తెలుస్తోంది. ఈ మూడున్నరేళ్లలో ఆయన పేరు అభివృద్ధి పనుల పరంగా కంటే వివాదాల పరంగానే ఎక్కువగా ప్రచారంలో వుంది. అధికారులతో వివాదాలు... సొంత పార్టీ నేతలతోనే విభేదాలు... కాంట్రాక్టర్లకు, మద్యం వ్యాపారులకు బెదిరింపులు వంటి చర్యలతో ఆయనపై తెలియని వ్యతిరేకత వచ్చేసింది. నియోజకవర్గంలో సొంత పార్టీ నేతలు ఆయన వైఖరిపై అసంతృప్తితో వున్నారు. అయితే ఇంత వ్యతిరేకత వున్నా కురుగొండ్ల మాత్రం మూడోసారి కూడా వెంకటగిరి టిక్కెట్ తనదేనని ప్రచారం చేసుకుంటున్నాడు. చంద్రబాబు అంత సామాన్యంగా ఎవరికీ టిక్కెట్ ఇవ్వడు. సర్వేలు చేయిస్తాడు, ఐవిఆర్‌ఎస్ ద్వారా వివరాలు రాబడతాడు. పదిమందిని పరిశీలించి, ఐదుగురిని సెలక్ట్ చేసి వారిలో ఒకరిని బెస్ట్ అని ఎంపిక చేస్తాడు. చంద్రబాబు వద్ద టిక్కెట్ గ్యారంటీ అన్నది వుండదు.

వెంకటగిరి టిక్కెట్ కోసం ఈసారి గట్టిపోటీ ఏర్పడే అవకాశం ఉంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఈ సీటు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ నియోజకవర్గంలో ఆయనకు బలమైన బంధువర్గం ఉండడంతో పాటు, డీసీసీబీ ఛైర్మెన్‌గా ఈ నాలుగున్నరేళ్లలో మంచిపేరు తెచ్చుకున్నాడు. మంచి పరిచయాలున్నాయి. ఆర్థికంగా మోటుకోగలడు. ఆయన అభ్యర్థి అయితే వ్యతిరేకత అన్న ప్రశ్నే లేదు. ఇక వెంకటగిరి రాజాల నుండి సర్వజ్ఞ యాచేంద్ర ఈసారి సీటును ఆశిస్తున్నాడని తెలుస్తోంది. పారిశ్రామికవేత్త గంగోటి నాగేశ్వరరావు కూడా రేసులో వున్నాడు. అన్నింటికి మించి నేదురుమల్లి రాజకీయ వారసుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కూడా వెంకటగిరి సీటుకు ప్రయత్నిస్తున్నాడు. టీడీపీ-బీజేపీల మధ్య పొత్తు కుదిరితే జిల్లాలో ఒక సీటును బీజేపీకి కేటాయించే అవకాశాలున్నాయి. ఈసారి నెల్లూరు నగరం, రూరల్‌లో తెలుగుదేశం అభ్యర్థులను దించే పరిస్థితి కనిపిస్తోంది. కాబట్టి వెంకటగిరిని బీజేపీకి కేటాయిస్తే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థి కావచ్చు. మొత్తానికి కురుగొండ్లకు మూడోసారి సీటు అంత సులభం కాకపోవచ్చు.





# సంక్రాంతికి గృహప్రవేశం



యాష్‌పాండ్‌లోని ఎన్టీఆర్ గృహాలను పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ

నెల్లూరు, వెంకటేశ్వరపురం యాష్‌పాండ్‌లో శరవేగంగా నిర్మిస్తున్న ఎన్‌టిఆర్ గృహాలను సంక్రాంతి పండక్కి ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. 25వ తేదీన ఆయన ఎన్టీఆర్ గృహాలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. సంక్రాంతికి 960 ఇళ్ళు పూర్తవుతాయని, లాటరీ పద్ధతిలో లబ్దిదారులకు అందజేస్తామన్నారు. మొత్తం 4,800 ఇళ్ళు 146 బ్లాకులుగా నిర్మాణం జరుగుతున్నాయని, 15నెలల్లో వీటి నిర్మాణం పూర్తవుతుందని మంత్రి చెప్పారు. వీటి నిర్మాణంలో చైనా, జపాన్, మలేషియా, కొరియా, సింగపూర్ వంటి దేశాల నుండి తెప్పించిన మిషనరీని వాడుతున్నట్లు చెప్పారు. ఈ గృహ సముదాయాల ప్రాంగణంలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీలలో ఎన్టీఆర్ గృహ సముదాయాలను నిర్మిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి పరసా రత్నం, నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ ఉల్లంఘన

## - ఎమ్మెల్యే గోవర్ధన్‌రెడ్డి



దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని వైయస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్, జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించాడు. గత నెల 25న నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాజ్యాంగేతర శక్తిగా నియంత పోకడలతో వ్యవహరిస్తున్నారన్నారు. ఏపిని అవినీతిలో మొదటి స్థానంలో ఉంచారన్నారు. రాష్ట్రమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతి, అక్రమ సంపాదనకు ప్రత్యేక ఏజెన్సీని ప్రారంభించారన్నారు. అలాంటి వ్యక్తి వై.యస్.జగన్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు కబుర్లు

## మళ్ళీ చురుకుగా ఎస్పీ



గ్రీవెన్స్ డేలో బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రామకృష్ణ

అనారోగ్యం కారణంగా కొన్నిరోజుల పాటు విశ్రాంతిలో వున్న జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ మళ్ళీ పనిలో పడ్డాడు. సోమవారం పోలీస్‌గ్రౌండ్‌లో జరిగిన గ్రీవెన్స్‌డేకు ఆయనే హాజరయ్యారు. అర్జీదారుల నుండి స్వయంగా అర్జీలు తీసుకుని పరిశీలించారు. వాటిని పరిష్కరించాలని ఆయాస్టేషన్‌ల సి.ఐలు, ఎస్ఐలకు ఎండార్స్ చేశారు. ఎస్పీ మళ్ళీ విధుల్లో చురుకుగా పాల్గొంటుండడంతో పోలీసుశాఖలోనూ పని వేగం పెరిగింది.

## కత్తెర బాధితుడ్ని పరామర్శించిన ఇన్‌ఛార్జ్ కలెక్టర్



చలపతిని పరామర్శిస్తున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్

నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్వాకానికి కడుపులో కత్తెర ఉంచుకుని ఇబ్బందులపాలైన చలపతిని, వారి కుటుంబాన్ని సోమవారం ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ పరామర్శించారు. కొత్తకాలువ వద్దగల చలపతి ఇంటికి ఆయన వెళ్ళారు. చలపతి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. చలపతికి వైద్యఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. చలపతికి మెరుగైన వైద్యం అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## డాక్టర్లను పెంచండి సార్!

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో కలిసి సోమవారం ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్‌అహ్మద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసారు. పెద్దాసుపత్రిలోని ప్రసూతి కేంద్రంలో వున్న సమస్యల గురించి చెప్పుకున్నారు. ప్రసూతి కేంద్రంలో రోజుకు 10 నుండి 15 కాన్పుల వరకు జరుగుతున్నాయని, 16మంది వైద్యులు ఉండాల్సిన చోట కేవలం ముగ్గురు వైద్యులే వుంటున్నారని, వారి మీద ఎక్కువ ఒత్తిడి ఉంటుండడం వల్ల వైద్యసేవలకు ఇబ్బందిగా వుంటుందని, కాబట్టి వైద్యుల నియామకం చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఇన్‌ఛార్జ్ కలెక్టర్ త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# నాకు ప్రజలే రక్ష... ప్రజలకు నేను రక్ష

- భద్రతా సిబ్బందిని మరోసారి తిరస్కరించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

2014 ఎన్నికల్లో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యేగా గెలిచీ గెలవగానే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న ప్రధాన నిర్ణయం ఐదేళ్ల పాటు శాసనసభ్యుడిగా తనకొచ్చే వేతనం, అలవెన్స్‌లను తన నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కేటాయించడం. రెండో ముఖ్య నిర్ణయం తన రక్షణ కోసం కేటాయించిన గన్‌మెన్‌లను తిరస్కరించి ప్రభుత్వంపై ఈ విధంగా కూడా కొంత భారం తగ్గించడం. ఇప్పటివరకు పోలీసు శాఖ ఆయనకు మూడుసార్లు గన్‌మెన్‌లను కేటాయించగా ఆయన వారిని తిప్పి పంపారు. కాగా, మన ఎమ్మెల్యే మన ఇంటికి కార్యక్రమంలో భాగంగా ఆయన రెండు నెలలుగా ప్రజల మధ్యే వుంటూ, వారి మధ్యే నిద్రపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు రక్షణ కల్పించాల్సి వుందన్న ఇంటలిజన్స్ సూచనల మేరకు సోమవారం ఆయనకు సెక్యూరిటీగా నలుగురు గన్‌మెన్‌లను పంపించారు. అయితే ఎమ్మెల్యే కోటంరెడ్డి వారిని తిప్పి పంపుతూ తన భద్రత గురించి శ్రద్ధ తీసుకున్న పోలీసుశాఖకు ధన్యవాదాలు తెలిపారు. నాకు



ఎటువంటి భద్రత అవసరం లేదు, నా నియోజకవర్గ ప్రజలే నన్ను భద్రంగా చూసుకుంటారు, వారికి నేను, నాకు వాళ్ళు రక్షణ... నాకు సెక్యూరిటీ అవసరం లేదని చెప్పి తిప్పి పంపారు.

## ఆమెకే బాధ్యతలు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డిఆర్‌డిఏ) పి.డిగా లావాణ్యవేణిని కొనసాగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. నెల క్రితం ఆమెను బదిలీ చేసి ప్రభుత్వానికి రిపోర్ట్ చేసుకోమన్నారు. ఆ తర్వాత మాతృశాఖ అయిన రెవెన్యూ శాఖకు పంపుతూ ఉత్తర్వులు పంపారు. అయితే ఆమె పి.డిగా వచ్చాక డిఆర్‌డిఏ పని తీరు మెరుగుపడింది. మంచి ఫలితాలు వచ్చాయి. డిఆర్‌డిఏ పి.డిగా ఆమెనే కొనసాగించాలని ఒత్తిళ్ళు వచ్చాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఆమెను అదే పోస్ట్‌లో కొనసాగించడానికి నిర్ణయం తీసుకుంది.

## ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఇ.డిగా రోజ్‌మాండ్

ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈడీగా రోజ్‌మాండ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం పౌరసరఫరాల్లో విజిలెన్స్ డిప్యూటి కలెక్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో ఈమె జిల్లాలోని పలు మండలాల్లో తహాశీల్దార్‌గా పనిచేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఇ.డిగా పనిచేసిన అంబేద్కర్ సెప్టెంబర్‌లో దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళి మరో జిల్లాకు డిఆర్వోగా బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఇన్‌ఛార్జ్ ఈడీగా ఐటిడిఏ పివో కమల కుమారి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె స్థానంలో రోజ్‌మాండ్‌ను నియమించారు.

## ఉత్తమ ఎన్‌సిసి ఆఫీసర్‌గా వి.ఆర్ ఉపాధ్యాయుడు



నెల్లూరులోని వి.ఆర్ హై స్కూల్‌లో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న ఎం.డి. సుజావుద్దీన్‌కు బెస్ట్ ఎన్.సి.సి ఆఫీసర్ అవార్డు లభించింది. గత నెల 26వ తేదీన తిరుపతిలో ఎన్‌సిసి నగర్‌లో జరిగిన 69వ ఎన్‌సిసి వ్యవస్థాపక దినోత్సవంలో ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ కె.వి.విఠల్, టిటిడి జె.ఇ.ఓ పోలా భాస్కర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. సుజావుద్దీన్ ఎన్నో ఏళ్ళుగా క్రమశిక్షణాయుతంగా విధులు నిర్వహిస్తూ వేలాదిమంది విద్యార్థులను ఎన్‌సిసిలో సైనికులు మాదిరిగా తీర్చిదిద్దారు. ఎన్‌సిసి విధి విధానాలను తూచ తప్పకుండా పాటించేవారు. ఆయన శ్రమకు ఫలితమే ఈ పురస్కారం. బెస్ట్ ఎన్‌సిసి ఆఫీసర్ అవార్డును అందుకున్న సుజావుద్దీన్‌ను సహ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## రెయిన్‌బోలో విచిత్ర పోటీలు



నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో ఇటీవల మూడురోజుల పాటు విచిత్ర వేషధారణలతో విద్యార్థులు అలరించారు. కిండర్ గార్డెన్‌కు జరిగిన ఈ పోటీలలో మొదటిరోజు ప్లేక్లాస్ చిన్నారులు పండ్లు, కూరగాయలు, తినుబండారాల వేషాలు ధరించారు. రెండోరోజు ఎల్‌కెజి చిన్నారులు బాలల కథలలోని పాత్రల వేషాలు ధరించారు. మూడోరోజున యుకెజి విద్యార్థులు జాతీయ మహనీయుల వేషధారణలతో అలరించారు. చిన్నారులలో లోకజ్ఞానం పెంచేందుకు, సమాజంపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు పాఠశాల డైరక్టర్ శ్రీమతి పద్మ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి అరుణస్వయంప్రభ, కిండర్ గార్డెన్ టీమ్ లీడర్ ఫాతిమాఖాన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు మాట్లాడితే నేరమా?



మాతృభాషా పరిరక్షణ ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న సభ్యులు

కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాతృభాషలో మాట్లాడితే అదో పెద్ద నేరంగా భావించి విద్యార్థులను శిక్షిస్తుండడం దారుణమని మాతృభాషా పరిరక్షణ ప్రజాచైతన్య యాత్ర రథసారధి, బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మ ఆవేదన వ్యక్తం చేశారు. 28వ తేదీన నెల్లూరులోని గాంధీబొమ్మకు పూలమాల వేసి నివాళులర్పించి మాతృభాషా పరిరక్షణ ప్రజాచైతన్య యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కనీసం ప్రాథమిక స్థాయి విద్య వరకు తప్పనిసరిగా తెలుగు మాధ్యమం ఉండేదని, ఇప్పుడు దానిని కూడా లేకుండా చేస్తున్నారని, ప్రస్తుత చదువుల పరిస్థితి చూస్తుంటే ఇది ఆంధ్రదేశమో, ఆంగ్లదేశమో అర్థం కావడం లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మాతృభాష అంతరించిపోయే రోజులు ఎంతో దూరంలో లేదనిపిస్తోందని వాపోయారు. ఈ కార్యక్రమంలో మైఖేల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుంగా నారాయణరెడ్డి, ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాశ్, బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, బిరుదవోలు రామిరెడ్డి, మాటేటి రత్నప్రసాద్, సర్వేపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో విద్యుత్ సబ్‌స్టేషన వద్దు

నెల్లూరు నగరం 16వ డివిజన్ జగదీష్‌నగర్‌లో ఉన్న పార్కు స్థలంలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించొద్దని శ్రీ జగదీష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు, స్థానికులు ఆందోళన చేసి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ జగదీష్‌నగర్, రాంజీనగర్‌లకు దగ్గరలో వున్న మున్సిపల్ పార్క్ స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం సబబుకాదన్నారు. స్థానికులు వాకింగ్ చేసేందుకు, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా వున్న పార్కులో సబ్‌స్టేషన్ నిర్మించడం మంచి పద్ధతి కాదన్నారు. సుప్రీం కోర్టు జి.ఓ ప్రకారం మున్సిపల్ పార్క్ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఉన్నప్పటికీ అధికారులు పార్కు స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించడం సుప్రీంకోర్టు జి.ఓ.లను విస్మరించడమేనన్నారు.

# లక్షణంగా 5లక్షల ఎకరాలకు నీళ్ళు

## ■ జిల్లా మంత్రులు సోమిరెడ్డి, నారాయణ ■



జిల్లాలో 5లక్షల ఎకరాలకు లక్షణంగా సాగునీళ్ళు అందిస్తామని, ఇందుకోసం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుండి కండ్లేరుకు 10 నుండి 20 టీఎంసీల నీటిని అదనంగా విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరుతామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. నవంబర్ 25వ తేదీన నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో మరో మంత్రి పి.నారాయణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో అవసరమైనమేర 2200 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయని, సోమశిల, కండలేరుల నుండి కావలి, కనుపూరు తదితర కాలువల ద్వారా 50.44 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం నుండి అదనంగా వచ్చే నీటిని ఎలా పంపిణీ చేయాలనేదానిపై సమీక్షిస్తామన్నారు. ఈశాన్య ఋతుపవనాల వల్ల జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేవని చెప్పారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ జిల్లాలోని 111 మున్సిపాల్టీలను అక్టోబర్ 2, 2016 నాటికే బహిరంగ మలవిసర్జన రహిత మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దడం జరిగిందని, తదనుగుణంగా ప్రధానమంత్రి ద్వారా ప్రశంసలు పొందడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 13జిల్లాల్లో బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా నెల్లూరుజిల్లా మొదటిస్థానంలో వుండడం గొప్ప విషయమన్నారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో డిసెంబరు 3వ తేదీ నుండి 41రోజుల పాటు ఆత్మగౌరవం దీక్షను చేపట్టనున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్, కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇరిగేషన్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు బి.ఎస్.వి.ప్రసాద్, సోమశిల ప్రాజెక్ట్ పర్యవేక్షక ఇంజనీరు రమణ, తెలుగుగంగ ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్ శ్రీమతి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ట్రాఫిక్‌పై ఎస్పీ దృష్టి



నెల్లూరు నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలపై నెల్లూరుజిల్లా ఎస్పీ రామకృష్ణ దృష్టి సారించారు. గత కొన్నేళ్ళుగా ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా గత నెల 28న జిల్లా ఎస్పీ నెల్లూరు నగర రోడ్లపై తిరిగారు. వాహనాలు ఎక్కువుగా నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. ఏయే ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ అవుతుంది, ఎందుకు అవుతుందనే విషయంపై ఆరా తీసారు. ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఎస్పీ ముఖ్యమైన కూడళ్ళను పర్యవేక్షించారు. చిన్నబజారు, పెద్దబజారు, ఆత్మకూరు బస్టాండు, గాంధీబొమ్మ, రామలింగాపురం అండర్‌బ్రిడ్జి, విఆర్సీ సెంటర్, మద్రాసు బస్టాండు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రదేశాలపై ఆంక్షలు విధించారు. డిఆర్ ఉత్తమ హోటల్ నుంచి రామలింగాపురం వెళ్ళే దారి, నాల్గవ నగర పోలీసుస్టేషన్ వైపు వెళ్ళే దారి, రామలింగాపురం అండర్‌బ్రిడ్జి నుంచి వెళ్ళే దారి, తదితర రోడ్లపై శాశ్వతంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో తోపుడుబండ్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నబజార్, పెద్దబజార్ ప్రాంతాల్లో ఒన్‌సైడ్ పార్కింగ్‌ను కొనసాగించాలని సూచించారు. కొత్తహాలు నుంచి కనకమహల్ వరకు మిడిల్ బారికేడింగ్ ఉండాలన్నారు. రామలింగాపురం నుంచి ముత్తుకూరు బస్టాండు పాయింట్ వరకు సింగిల్ లైన్ బారికేడింగ్ చేయమని ఆదేశాలు ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిని పట్టుకునేందుకు ఇద్దరు ఎస్సైలను నియమించి నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టాలని సూచించారు. ఇసుక ట్రాక్టర్లు అనుమతి లేని సమయంలో నగరంలోకి ప్రవేశించినా, తగిన పత్రాలు లేకపోయినా కేసులు బనాయించాలన్నారు.

# మారని 'రియల్' స్టోరీ

## ● ఏడాది దాటినా ఇంకా చిగురించని ఆశలు



***దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ఈ రాష్ట్రంలో మరీ ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో రియల్టర్లకు వరుస శాపాలు తగులుతూనే వున్నాయి. ఆయన మరణించి ఎనిమిదేళ్లయ్యింది. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్కటి కూడా రియల్టర్లకు ఊతమిచ్చే చర్యలు లేకపోగా, వరుసపెట్టి దెబ్బలు తగులుతూనే వున్నాయి.***

వై.యస్. తర్వాత రోశయ్య సీఎంగా వచ్చాడు. ఎటువంటి వేగవంతమైన విధానాలు లేకపోవడంతో రియల్ మార్కెట్ ఎక్కడిదక్కడ ఆగింది. రోశయ్య తర్వాత వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రాష్ట్రమే సంక్షోభంలో పడింది. రాష్ట్ర విభజనతో రియల్ రంగం కుదేలయ్యింది. విభజిత ఏపిలో 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. అమరావతి రాజధాని రాంగ్ నిర్ణయంతో 'రియల్' రంగంపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. ఈ మూడున్నరేళ్లలో రియల్ ఎస్టేట్‌లో కొంచెం ఊపు తేవడానికి ప్రభుత్వ పరంగా ఎటువంటి ప్రోత్సాహం లేదు. చంద్రబాబు వచ్చాక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం మరింతగా ముసుగుతన్ని పడుకుంది.

రియల్ ఎస్టేట్‌ను ఇవన్నీ ఒక కోణంలో దెబ్బతీసాయి. అయితే ఆ రంగాన్ని కోలుకోలేనంతగా దెబ్బతీసింది ఏడాది క్రితం పెరిగిన పెద్దనోట్ల రద్దే! అంతకుముందంతా అరకొరగానన్నా వ్యాపారం జరుగుతుండింది. నోట్ల రద్దుతో వ్యాపారం పూర్తిగా పడుకుంది. నోట్ల రద్దు తర్వాత ఎక్కడి లావాదేవీలు అక్కడ ఆగిపోయాయి. రియల్టర్ల ఆస్తులు ఫైనాన్షియర్ల చేతుల్లోనే ఉండిపోయాయి. స్థలాలు అమ్ముకునే పరిస్థితి లేక, ఫైనాన్షియర్ల అప్పు తీర్చే దారి లేక ఈ ఏడాదికాలంగా రియల్టర్లు నరకం అనుభవిస్తున్నారు. ఇటు చూస్తే వ్యాపారం లేదు, అటు చూస్తే నోట్ల రద్దు తర్వాత ఆస్తుల విలువలు బాగా తగ్గిపోయాయి. రియల్టర్లు కొన్న రేటుకు, ఇప్పుడు మార్కెట్‌లో వున్న రేటుకు పొంతన లేకుండా పోయింది. అటు చూస్తేనా ఫైనాన్షియర్ల దగ్గర తీసుకున్న అప్పుకు వడ్డీ పాపంలాగా పెరుగుతోంది. ప్రతి సెకను కూడా సంపాదించేది వడ్డీ వ్యాపారంలోనే! ఏడాది తిరిగేసరికి వడ్డీలు నడ్డి విరిచేలా పెరిగిపోయాయి. ఏడాది నుండి మార్కెట్ లేక అప్పులు కట్టలేక, ఆస్తులను వదులుకోలేక రియల్టర్లు నరకయాతన అనుభవిస్తున్నారు. నోట్ల రద్దు జరిగి ఏడాదైనా కూడా ఇంకా రియల్ మార్కెట్ బ్రతుకుల్లో ఏడుపు తప్ప సంతోషం కనిపించడం లేదు.

# కొత్తూరులో పోలీస్‌స్టేషన్ పెట్టిస్తా!

## - ప్రజాబాటలో శ్రీధర్‌రెడ్డి



'మన ఎమ్మెల్యే – మన ఇంటికి' కార్యక్రమంలో భాగంగా గత నెల 27న 57వ రోజు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్కచెరువుపాడు, ఓగూరుపాడు, కిచ్చరగుంట, అంబాపురం గ్రామాలలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా ఈ గ్రామాలకు పోలీస్‌స్టేషన్ అందుబాటులో లేని విషయాన్ని ఆయన గుర్తించారు. ఈ గ్రామాలలో ఏం జరిగినా బాధితులు పదికిలోమీటర్ల దూరంలో వున్న నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీయాల్సి వస్తోంది. దీనిపై స్పందించిన ఆయన 43 కాలనీలు, 2 కార్పొరేషన్ డివిజన్‌లతో కొత్తూరు గ్రామం శరవేగంగా విస్తరించిందని, ఇక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. జిల్లా ఎస్పీ చొరవ తీసుకుని కొత్తూరులో పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్యేగా దీని కోసం తీవ్రంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

# జగన్ కాలి మట్టితో సమానం!

## - 'నుడా' ఛైర్మెన్‌పై వైసిపి నేతల ఫైర్

గత నెల 25వ తేదీన వైసిపి నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాస యాదవ్‌లు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టారు. అదేపనిగా వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకుంటున్న నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఏకిపెట్టారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తాటి వెంకటేశ్వర్లు

ప్రపంచ మోసగాళ్ళ సంఘం అధ్యక్షుడు చంద్రబాబు లాంటి నాయకుడి పార్టీలో వున్న నువ్వు మా నాయకుడు జగన్మోహన్‌రెడ్డి కాలి ధుమ్ముతో కూడా సమానం కావు... నెల్లూరు కార్పొరేషన్ డ్రైనేజీ కంటే నీ నోరు ఎక్కువుగా గబ్బు పట్టింది. ఒకప్పుడు కమ్యూనిష్టులు 'చంద్రబాబు జమానా – అవినీతి ఖజానా' అని పుస్తకాలు అచ్చు వేయిస్తే, ఆ పుస్తకాలు పట్టుకుని నువ్వు నెల్లూరులో చంద్రబాబు మోసగాడు అంటూ ప్రచారం చేసావు, ఆ మోసగాడు, ఆ ప్రపంచ బ్యాంకు జీతగాడు ఇప్పుడు నువ్వు తెలుగుదేశంలో చేరగానే పునీతుడైపోయాడా? నుడా ఛైర్మెన్ అంటే ప్రభుత్వ అవినీతిని కప్పిపెట్టి ప్రతిపక్ష నేతను తిట్టమని కాదు, నీకు నీ నాయకుడి మీద అభిమానం వుంటే ఆయనకు చెక్కభజన చేసుకో... అనవసరంగా మా నాయకుడి మీద నోరు పారేసుకుంటే మర్యాద కూడా వుండదని వారు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని హెచ్చరించారు.



కర్ణాటక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రావి మోహన్‌చౌదరి ఇటీవల వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి నారా లోకేష్‌బాబును కలిసారు. బెంగుళూరులో నివసిస్తున్న ఎంతోమంది తెలుగువాళ్ళు ఆంధ్రలోని వివిధ జిల్లాల నుండి ప్రాతినిథ్యం వహిస్తున్నారని, ఒకసారి బెంగుళూరు వచ్చి ఒకరోజుని వాళ్ళందరి కోసం కేటాయించాలని ఆయన లోకేష్‌ని ఆహ్వానించాడు. మోహన్‌చౌదరి ఆహ్వానానికి లోకేష్ స్పందిస్తూ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం వీలుచూసుకుని తప్పక వస్తానని మాటిచ్చాడు.

## నిజాయితీ అధికారులు పనికిరారా?



బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నిజాయితీ అధికారులను పనిచేసుకోనివ్వకుండా బదిలీ పేరుతో ఇక్కడ నుంచి పంపించి వేస్తుంటే నెల్లూరు భవిష్యత్ ఏమిటని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నాడు. గత నెల 27న నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలను, పోలీసుస్టేషన్‌లకు వచ్చే బాధితులకు అండగా వుంటున్న ఎస్పీ రామకృష్ణ ప్రజల్లో నమ్మకం పొందారన్నారు. జిల్లా ఎస్పీగా వచ్చిన కొద్దిరోజుల్లోనే క్రికెట్ బెట్టింగ్‌తో పాటు సింగిల్ నెంబర్ లాటరీలు, గుట్కా తదితరాలతో పాటు ఎర్రచందనం, అక్రమ రవాణా, సిలికా పేరుతో ఇసుక అక్రమ రవాణాలను నిరోధించడానికి గట్టి చర్యలు తీసుకున్నారన్నారు. అక్రమార్కులకు చుక్కలు చూపిస్తున్న ఎస్పీ బదిలీ ప్రచారంపై ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఎస్పీపై అక్రమ బదిలీ వేటు వేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలుస్తోందన్నారు. ఇటువంటి బదిలీలలతో జిల్లాలో పని చేసేందుకు అధికారులు రావడం లేదన్నారు. ఈ సమావేశంలో మిడతల రమేష్, రాజేష్, సమాధి శ్రీనివాసులు, మొద్దు శ్రీనివాసులు, శ్యాం, నీలిశెట్టి కోటేశ్వరరావు, ములతాటి విజయ్, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ దినోత్సవాన్ని...

## విస్మరించడం బాధాకరం



అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న పనబాక కృష్ణయ్య

రాజ్యాంగ దినోత్సవాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం బాధాకరమని డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో వున్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభి షేకం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించారని, అయితే 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిం దన్నారు. ఇప్పటి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలు కాపాడకుండా భావస్వేచ్ఛ, దళితులు, మైనార్టీలపై దాడులకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేం దుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాయకులు సి.వి.శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్, చేవూరు దేవకుమార్‌రెడ్డి, ప్రత్తి సీతారాంబాబు, దార్ల సునీల్, ఆర్.వెంకటరమణయ్య, మమిత్‌షా, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

### భారతీయ సంస్కృతికి ప్రతీకలు

# వెంకటగిరి చీరలు



జాతీయ బహుమతి పొందిన చేనేతలతో రోటరీక్లబ్ అధ్యక్షులు మునిరాజా, కార్యదర్శి బాలకృష్ణంరాజు

భారతీయ సంస్కృతికి, నైపుణ్యానికి వెంకటగిరి చేనేత చీరలు ప్రతిబింబాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు పసుపులేటి ముని రాజా, కార్యదర్శి ఎన్.బాలకృష్ణంరాజు అన్నారు. జాతీయ స్థాయిలో చేనేత రంగంలో రాష్ట్రపతి బహుమతి పొందిన వెంకటగిరికి చెందిన 5మందికి జరిగిన సన్మానసభలో వారు అధ్యక్షోపన్యాసం చేశారు. వెంకటగిరిలో అన్ని కులాలకు, మతాలకు చెందిన కుటుంబాలు చేనేత వృత్తిలో జీవిస్తున్నారని, అంతర్జాతీయ స్థాయి అతిథులకు భారత ప్రభుత్వం వెంకటగిరి చీరలను కానుకగా ఇవ్వడం మన జిల్లాకే గర్వకారణమన్నారు. గతంలో రాష్ట్రపతి నుండి జాతీయ బహుమతి పొం దిన చేనేత కార్మికులు పట్నం మునీంద్ర బాబు, చీరాలరెడ్డి, మల్లికార్జున, కూన, బోగా రాములను రోటరీక్లబ్ ఘనంగా సన్మానించింది. సన్మానగ్రహీతలు మాట్లా డుతూ వ్యవసాయం తరువాత అత్యధికు లకు ఉపాధి కల్పిస్తున్నది చేనేత రంగమేనని అన్నారు. వంద రూపాయల నుండి లక్ష రూపాయల విలువైన చీరలు వెంకట గిరిలో తయారవుతాయన్నారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ రోటేరియన్లు అశోక్, పి.వి.కృష్ణయ్య, పి.జానకిరామిరెడ్డి, ఎన్.వి. రత్నం, పి.రఘురామిరెడ్డి, ఎ.ఎస్.ఎన్. రాజు, మయూరి శ్యాంయాదవ్, ఎం.దయాకర్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, దశ రథరామిరెడ్డి, కె.మునిగిరీష్, జి.జి. నాయుడు, పి.హరిప్రసాద్, శ్రీనివాసరెడ్డి, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### సిబిఎస్ఇ నేషనల్ అథ్లెటిక్ మీట్‌లో...

# ప్రతిభ చాటిన ఎల్.ఎ.పి విద్యార్థులు



విజేతలతో ఎల్ఏపి స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్, కోచ్ రమేష్

సి.బి.ఎస్.ఇ ఈ సంవత్సరం నవంబర్ 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు నేషనల్ అథ్లెటిక్ మీట్‌ను ఛత్తీస్‌గడ్‌లోని భాయేత్రలో ఘనంగా నిర్వహించారని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలకు ఏడు గల్ఫ్ దేశాలు నుండి వచ్చిన విద్యార్థులతో పాటు దేశవ్యాప్తంగా 3,750 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా ఈ పోటీలకు అర్హత పొందడానికి ఎల్ఏపి స్కూల్ విద్యార్థులు సౌత్‌జోన్‌లో జరిగిన పోటీలలో పాల్గొని లాంగ్ జంప్‌లో ఎన్.ధనుష్ మరియు 4×100 మీటర్ల పరుగులో ఎమ్.సంతోష్, ఎస్.ఎన్.వి.తరుణ్, ఐ.సునీల్, ఎన్.ధనుష్ బంగారు పతకాలను సాధించారని, నేషనల్స్‌లో లాంగ్‌జంప్‌లో యన్.ధనుష్ వెండి పతకాన్ని మరియు సంతోష్, తరుణ్, సునీల్‌తో కలిసి 4×100మీటర్ల ఒకే పరుగులో కాంస్య పతకాన్ని సాధించా రని, దక్షిణ భారతదేశం నుండి పతకాలు సాధించిన ఒకే ఒక్క పాఠశాల ఎల్.ఎ.పి అని అన్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాల పేరును నిలబెట్టిన విద్యార్థులకు కరస్పాండెంట్ సుబ్ర హ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కోచ్ రమేష్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## రాజ్యాంగాన్ని గౌరవించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు పార్వతయ్య, తాజుద్దీన్

గూడూరు పట్టణంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించు కుని నవంబర్ 27న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సభ్యుడు అరవ పార్వతయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని దేశంలోని ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అట్రాసిటి మెంబర్ తాజుద్దీన్, ప్రతినిధులు విజయకుమార్, మల్లిఖార్జున్ తదితరులు ఉన్నారు.

### ఓటర్ల నమోదులో...

## బిఎల్‌వోలకు సహకరించండి

**- తహశీల్దార్ వెంకటేశ్వర్లు**

గూడూరు పట్టణంలో ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడుతున్న బిఎల్‌వోలు(బూత్ లెవల్ అధికారులు) సంపూర్ణంగా ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ప్రజలు సహకరించాలని గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆయన ఇటీవల విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్‌బూత్ పరిధిలో బిఎల్‌వోలు ఓటర్ల జాబితాను సేకరించి ఓటర్ల నమోదు ప్రక్రియలో సవరణలు, చేర్పులు, మార్పులు, ఇతర తొలగింపులను వేగవంతం చేసేలా చూడాలని కోరారు. పట్టణంలో ప్రస్తుతం ఇంటింటి ఐఆర్ఇఆర్‌లో జరుగుతున్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# నూటికి 110 మార్కులు తెచ్చుకున్న వివేకా!

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. కాపువీధిలోని ఆనం నివాసం. రాత్రి డైనింగ్ టేబుల్ వద్ద స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(66+), ఆనం రామనారాయణరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్ రెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డి, శుభకర్‌రెడ్డి, కార్తికేయ రెడ్డిలు భోజనానికి కూర్చోగా మహిళలు ప్లేట్లలో వడ్డించసాగారు. భోజనం చేయడానికి ముందు వివేకా కళ్లకున్న నల్లద్దాలు తీసి పక్కనపెట్టి చొక్కా జేబులో నుండి ఓ చీటీ తీసి మడత విప్పాడు. గోడకు వున్న తన మాతృమూర్తి స్వర్గీయ రమణమ్మ గారి ఫోటోను చూస్తూ...

అమ్మా...

మేకప్ వేసుకోవడానికి అందమైన ముఖాన్నిచ్చావ్
సెకండ్‌షోలకు వెళ్ళడానికి డబ్బులిచ్చావ్
రాసుకోవడానికి పలకనిచ్చావ్
గీసుకోవడానికి గడ్డమిచ్చావ్
తిరగడానికి కారిచ్చావ్
తాగడానికి నీరిచ్చావ్
నలుగురిని అభిమానించే మనసునిచ్చావ్
నలుగురి మెప్పుపొందే లీడర్‌షిప్‌నిచ్చావ్
మరి ఎందుకమ్మా మమ్మల్ని వదిలి వెళ్లావ్...
మమ్మల్ని వదిలి వెళ్లావ్...
అయినా నువ్వెప్పుడూ మా గుండెల్లోనే ఉంటావ్...
మా గుండెల్లోనే ఉంటావ్...
ఒక్కసారి నీ ఒడిలో పడుకుని నిద్రపోవాలని ఉందమ్మా...
చిన్నపిల్లాడినై నీ చేతి గోరుముద్దలు,
నీ చేత చెంపదెబ్బలు తినాలని ఉందమ్మా...

అని అంటూ వెక్కివెక్కి ఏడవసాగాడు. అందరూ ఆయనను ఓదార్చారు. భోజనాలయ్యాక వివేకా తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు.

★★★★★

"బుడిబుడినడకల తప్పటడుగులే మణిమాణిక్యాలు' అనే 'యమలీల' సినిమా పాట వినిపించడంతో వివేకా కళ్లు తెరిచాడు. ఎదురుగా ఆయన అమ్మ వెంకటరమణమ్మ చేతిలో ఇడ్లీ గిన్నెతో వుంది. వివేకా ఆనందంతో లేచాడు. ఒకసారి తనను చూసుకున్నాడు. మనిషి నిక్కరు, చొక్కా మీద వున్నాడు. పక్కనేవున్న అద్దంలో తనను తాను చూసుకున్నాడు. ఆశ్చర్యం... పదేళ్ళ బాలుడిలా వున్నాడు. ఒక్క నిముషం అతనికేమీ అర్థం కాలేదు. నేనింకా చిన్నపిల్లాడినేనా... నేను కాలేజీకి పోవడం, క్లాసు ఎగ్గొట్టి గోడలు దూకి సినిమాకు పోవడం, స్కూటర్ మీద రౌండ్లు కొడుతూ అమ్మాయిలకు సైటు కొట్టడం, ఏ.సి సెంటర్‌లో వేరుశెనక్కాయలు తినడం, నెల్లూరు మున్సిపల్ ఛైర్మెన్ కావడం... మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం... ఇదంతా కలేనా? మరి నాకు పరిచయమైన వీళ్లంతా ఎవరు... నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వై.యస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.వి.పి.రామచంద్రరావు, బొత్స సత్యనారాయణ, సి.వి.శేషారెడ్డి, డేగా నరసింహారెడ్డి, కలికి యానాదిరెడ్డి, చాట్ల నరశింహారావు, పిండి సురేష్, భానుశ్రీ, బర్నా, మాధవ... అసలు వీళ్లంతా ఎవరు? వీళ్లతో నాకు పరిచయం వున్నట్లు వచ్చిన ఈ కలంతా ఏంటి...? తెల్లారుజామున వచ్చిన కలలు నిజమవుతాయంటారు. నేను పెద్దయ్యాక ఎమ్మెల్యేనవుతానేమో... వీళ్ళందరితో పరిచయం కలుగుతుందేమో... ఆ కలలో వచ్చిన సంఘటనలు ఇంకొన్ని మరిచిపోయా... నెల్లూరులో షాపింగ్ మాల్స్ ఓపెనింగ్. సినిమా హీరోయిన్‌లు రావడం, హీరో మాదిరిగా వారితో కలిసి తాను వాటిని ప్రారంభించడం.. అబ్బో ఈ కలే ఇంత అందంగా వుంటే ఇక నిజమైతే ఇంకెంత బాగా ఉంటుందో అని మనసులో అనుకున్నాడు. ఈలోపు వెంకటరమణమ్మ... ఏంటి కన్నా అంతగా ఆలోచిస్తున్నావ్ అని అడిగింది. అప్పుడు తనకొచ్చిన కలల గురించి వివేకా చెప్పాడు. నా బుజ్జికొండకు అన్నీ మంచి కలలే వస్తాయి. నువ్వు పెద్దయ్యాక పెద్ద లీడర్‌వు అవుతావుగాని. ఇప్పుడు మాత్రం బుద్ధిగా చదువుకో... ఇదిగో ఈ రెండు ఇడ్లీలు తిను అంటూ ఇడ్లీ ముక్క తుంచి నోటిలో పెట్టబోయింది. అప్పుడు వివేకాకు మళ్ళీ ఇంకో ఆలోచన... రియాజ్ బిరియాని, రాగిసంగటి, పాయ, తలకాయ కూర... నేను ఇవన్నీ తింటుంటానే... ఓహో... అది కూడా కలే అయ్యుంటుందని అనుకుని తన తల్లికి ఆ కల గురించి కూడా చెప్పాడు. నువ్వు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటే ఆదివారం బిర్యానీ చేసి పెడతానులే అని రమణమ్మ చెప్పారు. బిర్యానీ అనగానే... అది ఎలా వుంటుందో తినాలనిపించింది వివేకాకు. తల్లి పెట్టిన టిఫిన్ తిని లేచి గబగబ రెడీ అయ్యి తెల్లచొక్కా, బ్లూ నిక్కర్ యూనిఫామ్ వేసుకున్నాడు. రమణమ్మగారొచ్చి తలకు ఆముదం పెట్టి నున్నగా దువ్వి... ఇప్పుడూ చక్కగా చూడముచ్చటగా వున్నావని కొడుకును మెచ్చుకుంది. వివేకా తనతో పాటు తమ్ముళ్ళు రామనారాయణ, జయ, విజయలను తోడబెట్టుకుని స్కూల్ కెళ్లాడు. వివేకా ఐదో తరగతి, రామనారాయణ నాలుగో తరగతి, జయ, విజయలు మూడో తరగతి. అప్పుడే సోషల్ టీచర్ వచ్చాడు. పిల్లలకు ప్రశ్నలు వేయసాగాడు. అమెరికా అధ్యక్షుడు ఎవరు? అని అడిగాడు. వివేకా టక్కున లేచి... డోనాల్డ్ ట్రంప్ అని చెప్పాడు. టీచర్‌కు మండింది. తిక్కతిక్క సమాధానాలు చెప్పకు... ట్రంప్ ఎవరు...? ఆ పేరెప్పుడూ వినలేదే... అమెరికా ప్రెసిడెంట్ రిచర్డ్ నిక్సన్ అని చెప్పి... మళ్ళీ కనీసం ఇండియా ప్రధాని అన్నా తెలుసా? అని అడిగాడు. వివేకా వెంటనే నరేంద్ర మోడీ అని చెప్పాడు. ఈసారి టీచర్ బెత్తం తీసుకుని వివేకా పిర్ర మీద కొట్టి.. ఈ పేర్లన్నీ ఎక్కడ కనిపెట్టావ్... మన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ... అని చెప్పాడు. వివేకాకు అంతా అయోమయంగా వుంది... ట్రంప్... నరేంద్రమోడీల గురించి కూడా కలే అయ్యుంటుందనుకున్నాడు. టీచర్ పాఠం ఆపి ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు ఇవ్వసాగాడు. వివేకా కూడా వెళ్ళి ప్రోగ్రెస్‌రిపోర్ట్ తీసుకున్నాడు. 100కి 10మార్కులు వచ్చాయి. ఈ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపిస్తే అమ్మ బిర్యానీ కాదు కదా పొద్దున్నే చద్దనం కూడా పెట్టదు అనుకున్నాడు. 10 పక్కన సున్నా పెడితే తేడా కనిపెడతారనుకుని 10 ముందు 1ని చేర్చడం సులభమవుతుందని చెప్పి ఆ పని చేసాడు. స్కూల్ వదలగానే ఇంటికెళ్లాడు. ఎంతో హుషారుగా బ్యాగులో నుండి ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసి గర్వంగా తన తల్లి చేతికిచ్చి... బిర్యానీకి సామాన్లు రెడీ చేసుకోమన్నట్లుగా చూసాడు. ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను చూసిన రమణమ్మ గారు పక్కనే వున్న బెత్తం తీసుకుంది. ఆమె బెత్తం తీసుకోవడంతోటే వివేకా నిక్కర తడుపుకున్నాడు. వెదవా... ఇట్లాంటి పనులు కూడా చేస్తున్నావా... ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో మార్కులను నువ్వే దిద్దుకుంటావా? అని కోపంగా అడిగింది. నేనెంతో తెలివిగా దిద్దానమ్మా... నువ్వెలా కనిపెట్టావని వివేకా అడిగాడు. ప్రపంచంలో వందకు నూటపది మార్కులు ఏ తల మాసినోడికన్నా వస్తాయా... ఆ మాత్రం తెలియదా అంటూ బెత్తంతో రెండు దెబ్బలు తిగిలించింది. అమ్మా కొట్టొద్దమ్మా... ఇంకెప్పుడూ అలా చేయనమ్మా... కొట్టొద్దమ్మా... కొట్టొద్దమ్మా... అంటూ వివేకా కేకలు పెట్టసాగాడు. ఆ కేకలు విని క్రింద వున్న ఏ.సి.సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డి, పి.ఏ రాజులు పరుగెత్తుకుంటూ పైకి వెళ్లారు. నిద్రలోంచి ఉలిక్కిపడి లేచిన వివేకా... ఆ నిద్ర మత్తులోనే కొట్టొద్దమ్మా... కొట్టొద్దమ్మా అని అరుస్తున్నాడు. రాజు కొంచెం నీళ్ళు తెచ్చి ఆయన ముఖాన చల్లాడు. అప్పటికిగాని ఆయనకు నిద్రమత్తు వదల్లేదు. కొద్దిసేపటికి అప్పటిదాకా జరిగిందంతా కల అని గ్రహించాడు. రాత్రి పడుకునే ముందు తన తల్లినే తలచుకుని నిద్రపోవడంతో, ఆమె ఈ విధంగా తన కలలోకి వచ్చి తనను చిన్నతనంలోకి తీసుకెళ్ళి ప్రేమగా చూసుకుంది అని మనసులో అనుకుని... పక్కనే వున్న సిగరెట్ పెట్టె అందుకున్నాడు.

'గల్పిక' పాఠకురాలు స్వర్గీయ శ్రీమతి ఆనం వెంకటరమణమ్మ గారికి నివాళులర్పిస్తూ... ఈ 'గల్పిక' అంకితం.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ప్రభుత్వ కార్యాలయాలలో పనులు వాయిదా పడవచ్చును. ప్రయాణాల విషయంలో ముందు వెనుకల ఆలోచిస్తారు. ఉద్యోగులు పబ్లిక్‌తోను అధికారులతో జాగ్రత్తగా మెలగండి. స్థిరాస్తులపై ఆదాయం, షేర్ల వ్యాపారాలలో కొద్దిపాటి లాభాలుంటాయి. ఆరోగ్యం ఒక మోస్తరుగా ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. అనుకోని ఖర్చులు పైనబడగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. వృత్తి పరంగా రాణిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలుంటాయి. అనుకున్న పనులు సమర్ధవంతంగా జరుపుతున్నా అప్పుడప్పుడు టెన్షన్ పడుతుంటారు. మీ వ్యక్తిత్వానికి మంచి విలువ గౌరవముంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆదాయం సంతృప్తికరము.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ, పునర్వసు 1, 2, 3పాదాలు

ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. రావలసిన బాకీలు కొంతమొత్తం అందవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా వ్యవహరించండి. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభించగలవు. విద్యార్థులకు చదువు శ్రద్ధ తగ్గి, వ్యాపకాలు పెరుగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కోర్టు కేసులు వాయిదా పడతాయి. సహచరులను ఆదుకొనడం జరుగుతుంది. వృత్తి పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉద్యోగులకు అధికార వర్గంతో సాన్నిహిత్యం కలుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో వున్న వారికి చిరు అవకాశాలు దొరకగలవు. ముఖ్యమైన పత్రాలు, వస్తువులు జాగ్రత్తపరచుకొనాలి. విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులు సమర్ధవంతంగా వ్యవహరిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. అనవసర వ్యవహారాలలోకి లాగడానికి ఇతరులు ప్రయత్నిస్తారు. కాబట్టి జాగ్రత్త పడండి. పిల్లలకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగి తీరిక లేకుండా శ్రమపడతారు. పనులందు టెన్షన్ ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. బిడ్డల ఉద్యోగ వివాహాల ప్రయత్నాలు ఫలించగలవు. అనుకోని ప్రయాణాలు, ప్రముఖులను, ఆత్మీయులను కలుసుకొనడం జరుగుతుంది. విద్యాప్రగతి బాగుంటుంది. సమావేశాలలో మీ సూచనలకు ఆమోదం లభిస్తుంది. ఆస్తి వ్యవహారాలు, బాకీ వ్యవహారాలు ఒక సర్దుబాటుకు వస్తాయి. ఆర్థికంగా ఇబ్బందులు అంతగా ఉండవు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 1.12.2017 నుండి
తేది. 7.12.2017 వరకు

ఈ వారము మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో కుజ గురువులు, వృశ్చికంలో రవి బుధ శుక్రులు, ధనుస్సులో శని, మకరంలో కేతువు సంచరిస్తారు.

పంచాంగము
శుక్రమౌఢ్యమి జరుగుతున్నది.
ముహూర్తములుండవు.

### మార్గశీర్ష మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 1 | శుక్ర | త్రయోదశి | రా॥ గం.2.04వ॥ |
| తేది. 2 | శని | చతుర్దశి | రా॥ గం.12.15వ॥ |
| తేది. 3 | ఆది | పూర్ణిమ | రా॥ గం.10.10వ॥ |

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 4 | సోమ | పాడ్యమి | రా॥ గం.7.56వ॥ |
| తేది. 5 | మంగళ | విదియ | సా॥ గం. 5.35వ॥ |
| తేది. 6 | బుధ | తదియ | సా॥ గం.3.11వ॥ |
| తేది. 7 | గురు | చతుర్థి | ప॥ గం.12.58వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసభ్యులతో సామరస్య ధోరణిలో నడుచుకొనండి. సోదరీ సోదర వర్గాలకు మంచి జరుగుతుంది. వర్కర్లతో యజమానులకు సమస్యలు ఏర్పడవచ్చును. అనుకోని ఆదాయం వస్తు ధన రూపంలో లభించగలదు. ఉద్యోగ ప్రయత్నం చేసేవారికి చిన్న అవకాశాలు దొరకగలవు. అనవసర వివాదాలలో తలదూర్చకుండా జాగ్రత్త పడండి. వ్యాపార వర్గాలకు ఆదాయం పెరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

జీవిత భాగస్వామి సలహాలు పాటించండి, మేలు జరుగుతుంది. ఉద్యోగార్థులకు స్థానమార్పులు, ప్రమోషన్లు వంటివి వస్తాయి. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు, ఎదుటివారి వల్ల మేలు జరగడం ఉంటుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు కలిగినా సమర్ధవంతంగా చక్కదిద్ది నిర్వహిస్తారు. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల అభీష్టాలకు అనుగుణంగా నడుచుకొనవలసి వస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కోర్టు కేసులు, ఆస్తి వ్యవహారాలు వాయిదా పడతాయి. సాహిత్య, కళా, క్రీడా రంగాల వారికి అవకాశాలు లభిస్తాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఎదుటివారి ప్రలోభాలకు, ఆశకలిగించే మాటలకు లొంగవద్దు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తులు, షేర్లపై లాభాలుంటాయి. శుభకార్యాలను నిర్ణయం చేస్తారు. ఓర్పు, లౌక్యంతో పనులు సాధించగలరు. సోదరవర్గానికి మేలు జరుగుతుంది. చిన్న విషయాలపై ఇంట్లో వారితో తగాదాలు రావచ్చును. ఆరోగ్యం బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. ఇంటర్వ్యూలకు తయారౌతారు. క్రొత్త వ్యాపారాలకు, భాగస్వామ్య వ్యాపారాలకు నిర్ణయాలు జరుగవచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధుమిత్ర వర్గాలకు యధోచిత సహాయం అందిస్తారు. అధికారులకు స్థానమార్పు, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. క్రొత్త వస్తువులు కొనడం, అనుకోని ప్రయాణాలుంటాయి. పట్టుదలతో శ్రమించి అనుకున్న పనులు సాధిస్తారు. ఆర్థికస్థితి బాగుండి మంచి అవకాశాలు దొరుకుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు విధి నిర్వహణలో సమర్థత, అధికారులతో చనువు లభిస్తుంది. విలువైన వస్తువులు, గృహోపకరణాలు కొంటారు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయకండి. శ్రేయోభిలాషులను సంప్రదించండి. వ్యాపార వృత్తి రంగాల వారికి అవకాశాలు చేజారిపోవచ్చును.

# కళ్యాణ వైభవం...!



ప్రముఖ ఆడిటర్, శ్రీ సిటి డైరెక్టర్ దువ్వూరు సుధాకర్‌రెడ్డి - అనితల కుమారుడు
**ప్రదీప్‌కుమార్ - మోనిషా** (హైదరాబాద్ వాస్తవ్యులు డాక్టర్ వై.ప్రతాప్‌రెడ్డి - నిర్మలల కుమార్తె)ల
కల్యాణం నవంబర్ 24వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది.
వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ లింగాల చంద్రమల్‌రెడ్డి - మల్లీశ్వరిల కుమారుడు
**వీరారెడ్డి - హర్షలారెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు మసర్ల వెంకటేశ్వర్లురెడ్డి - పద్మజల కుమార్తె)ల వివాహం
నవంబర్ 25వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది.
కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరు మాగుంట లే అవుట్ వాస్తవ్యులు పెమ్మసాని సునీల్‌బాబు - శారదల కుమారుడు
**శ్రీరామ్ ప్రసాద్ - దీపు** (చెన్నై వాస్తవ్యులు కోనేరు మారుతీప్రసాద్ - జ్యోతిల కుమార్తె)ల పెళ్ళి
నవంబర్ 24వ తేదీ చెన్నైలోని ఏటిఎం వెడ్డింగ్ & కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది.
నూతన దంపతులకు 'లాయర్' అభినందనలు.



నెల్లూరు జడ్పీ కాలనీ వాస్తవ్యులు బాసం ఓబులరావు - రాజేశ్వరిల కుమారుడు
**శ్రీరామ్ - సింధు** (కావలి పట్టణ వాస్తవ్యులు మండవ వెంకయ్య - సునీతల కుమార్తె)ల పరిణయం
నవంబర్ 24వ తేదీ నెల్లూరులోని డిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది.
కొత్తదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

### అంగన్‌వాడీ కేంద్రాలకు...

# సామాగ్రి అందజేసిన సిఎంఆర్



అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలకు సామాగ్రి అందజేస్తున్న కమిషనర్ ఢిల్లీరావు, శ్రీమతి ప్రశాంతి, మావూరు వాసు, రాజీయాడ్స్ పెంచలయ్య తదితరులు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నెల్లూరులోని సిఎంఆర్, చందన షాపింగ్‌మాల్ వారు 2లక్షల రూపాయలు విలువ జేసే 100 వంటపాత్రలు, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్ సెట్లు ఉచితంగా అందజేశారు. ఇటీవల సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు అంగన్‌వాడీ ఆయాలకు వీటిని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారదృష్టితోనే కాకుండా, సామాజిక దృష్టితో కూడా సిఎంఆర్ షాపింగ్‌మాల్ వారు పని చేస్తుండడం అభినందనీయమన్నారు. తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ శ్రీమతి ప్రశాంతి మాట్లాడుతూ సిఎంఆర్ వారు తమ ఔదార్యాన్ని చాటుకుని అంగన్‌వాడీలకు నాణ్యమైన వస్తువులను అందజేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 3న 'గంపకూడు' కవితా సంపుటి ఆవిష్కరణ



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న కళాంజలి అనంత్, చిన్ని నారాయణరావు, ఈదూరు సుధాకర్

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం, కళాంజలి సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ ఆదివారం సాయంత్రం 6.05గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో తాను రచించిన "గంపకూడు" కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ప్రముఖ కవి చిన్ని నారాయణరావు పేర్కొన్నారు. గత నెల 30న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'గంపకూడు' కవితా సంపుటిని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అహ్మద్ ఆవిష్కరిస్తారని తెలిపారు. సభాధ్యక్షులుగా 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి వ్యవహరిస్తారని, ముఖ్యఅతిథులుగా నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ కమిటి సలహా సంఘ సభ్యులు బీద మస్తాన్‌రావు, నెల్లూరు డివిజన్ స్టేట్‌ట్యాక్స్ జాయింట్ కమిషనర్ ఎస్.ఇ.కృష్ణమోహన్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య పాల్గొంటారని తెలిపారు. ఆత్మీయఅతిథులుగా నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్, ప్రముఖ కవి డా॥ బీరం సుందరరావు పాల్గొంటారని తెలిపారు. అనంతరం మాట దీర్ఘ కవిత ఆంగ్లానువాదం 'ది వర్డ్' పరిచయ కార్యక్రమం జరుగుతుందన్నారు. మాట ఆంగ్లానువాదకులు విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త రామతీర్థ, కవి, రచయిత్రి జగద్ధాత్రి, బెంగుళూరు యూనివర్శిటి తెలుగు డిపార్ట్‌మెంట్ ఛైర్‌పర్సన్ కె. ఆశాజ్యోతి 'మాట' ఆంగ్లానువాదంపై ప్రత్యేకంగా ప్రసంగిస్తారని తెలిపారు. కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు కళాంజలి అనంత్ మాట్లాడుతూ ఈ సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సినిమా పాటల పోటీలు, మధ్యాహ్నం 3గంటల నుంచి కవితల పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6గంటల నుండి శాస్త్రీయ, జానపద, సినీ నృత్య ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో రచయితల సంఘం గౌరవాధ్యక్షులు డా॥ ఈదూరు సుధాకర్, ప్రముఖ యువ ఆడిటర్ చిన్ని శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

# భగవద్గీత పోటీల్లో వాత్సల్య విద్యార్థుల ప్రతిభ



భగవద్గీత పోటీలలో విజేతలైన విద్యార్థినులు

తిరుమల తిరుపతి దేవస్థానం వారు గీతా జయంతిని పురస్కరించుకుని గత నెల 29వ తేదీ నిర్వహించిన భగవద్గీత పోటీలలో నెల్లూరులోని జనహిత వాత్సల్య విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటారు. 8మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ స్థానాలు పొందారు. ఈ పోటీల్లో వాత్సల్య విద్యాసంస్థలైన భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీషుమీడియం హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. 30వతేదీ వాత్సల్య ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. వాత్సల్య సంఘటనా కార్యదర్శి జి.వి.సాంబశివరావు, సహకార్యదర్శి టి.వి.ఎస్.దుర్గాప్రసాదరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, గుత్తికొండ ఆంజనేయులు, జె.ఎస్.ఆర్.మూర్తి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించి, బహుమతులను అందజేశారు.

## జన్మనివ్వకపోయినా... పునర్జన్మనిచ్చి

# ఏడుగురికి 'అమ్మ'య్యింది

● అవయవదానంతో ఏడుగురి జీవితాలకు వెలుగు



ఆమె మరణించినా ఏడుగురికి పునర్జన్మనిచ్చింది. అవయవదానంతో వారి జీవితాలకు వెలుగునిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కొడవలూరు మండలం బొంతల పాళెం గ్రామానికి చెందిన బాలిరెడ్డి నరసమ్మ(60) బ్రెయిన్ డెడ్ కావడంతో ఆమె అవయవాలను ఆమె కుటుంబీకులు దానం చేసి ఏడుగురు జీవితాల్లో వెలుగులు ప్రసరింప జేశారు. నరసమ్మ కుటుంబ సభ్యులు అందుకు సమ్మ తించడంతో ఆ మేరకు వైద్యులు ఈ ప్రక్రియను విజయవంతం చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బాలిరెడ్డి బలరామరెడ్డి భార్య నరసమ్మ ఇటీవల నెల్లూరు సమీపంలో జరిగిన ఓ వివాహానికి హాజరైంది. అయితే, అక్కడ ఆమెకు తీవ్రమైన తలనొప్పి రావడంతో కిందపడిపోవడం, వెంటనే ఆమెను సింహపురి ఆసుపత్రికి తరలించడం జరిగాయి. అధిక రక్తపోటు కారణంగా మెదడులో రక్తస్రావమై ఆమె బ్రెయిన్‌డెడ్‌కు గురైందని, అయితే ఆమె శరీరంలోని మిగిలిన అవయవాలన్నీ పనిచేస్తున్నాయని వైద్యులు ఆమె కుటుంబసభ్యులకు తెలిపారు. మీరు సమ్మతిస్తే అవయవదానం ద్వారా మరికొంతమందిని బ్రతికించినట్లవుతుందని చెప్పగా, నరసమ్మ ద్వితీయకుమార్తె అందుకు అంగీకరించడం, వైద్యులు జీవన్‌ధార సంస్థకు సమాచారమందించడంతో వారు వచ్చి ఆమె దేహం, కిడ్నీలు, కళ్ళు, ఊపిరితిత్తులు, కాలేయంను సేకరించారు. వీటిలో ఒక కిడ్నీని తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వారు, మరో కిడ్నీని సింహపురి ఆసుపత్రివారు, నేత్రాలను నగరంలోని మోడరన్ కంటి ఆసుపత్రివారు, కాలేయాన్ని విశాఖలోని అపోలో ఆసుపత్రివారు, ఊపిరితిత్తులను చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రివారు రోగులకు అమర్చేందుకు తీసుకువెళ్ళారు. నరసమ్మ చనిపోయినా మరో ఏడుగురికి పునర్జన్మనిచ్చి తన జీవితాన్ని సార్థకత చేసుకుంది.

# పోలవరం... ఇక కలవరం

***ఈ ప్రాజెక్ట్ నువ్వే చెయ్యాలి బాబూ అని వాళ్ళు అడగలేదు... ఆ ప్రాజెక్ట్ వాళ్ళ బాధ్యత... పూర్తి చేయాల్సింది వాళ్ళు... రాష్ట్ర విభజన చట్టంలో క్లియర్‌గా వుంది. ఈయన తగుదునమ్మా అంటూ వెళ్ళాడు... పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యత మేమే తీసుకుంటామన్నాడు. చిక్కిందే తడవుగా వాళ్ళు ఆయన నెత్తిన పెట్టారు. ఈయన నెలకోసారి అంచనాలు పెంచుకుంటూ పోతుంటే వాళ్ళు సంవత్సరానికోసారి కూడా నిధులు ఇవ్వడం లేదు. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను నేను చేయలేనంటూ చేతులెత్తేసాడు.***

గురువారం అసెంబ్లీ సాక్షిగా పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడం తమవల్ల కాదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రక టించి తన నిస్సహాయతను చాటుకున్నారు. ఉన్న నిధులన్నింటిని పుష్కరాలకి, పండుగలకి, సింగపూర్ రాజధాని అని తగలేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి అయిన పోలవరంను మాత్రం త్రిశంకుస్వర్గంలో పెట్టాడు.

పోలవరం రాష్ట్ర ప్రజానీకానికి వరమే. కాంగ్రెస్ ప్రభుత్వం లోని దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. దీనికి అత్యంత అవసరమైన కాలువల తవ్వకాన్ని ముందుగానే చేయించారు. రెండో టర్మ్ కూడా వై.యస్. వుం డుంటే పోలవరంకు ఒక రూపం వచ్చివుండేది. ఆయన మర ణంతో ఈ ప్రాజెక్ట్ మరుగున పడగా, విభజన సమయంలో మళ్ళీ తెరమీదకొచ్చింది. రాష్ట్ర విభజన హామీలలో పోలవరం ప్రాజెక్ట్ ఒకటి. దీనిని పూర్తిచేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని విభజన చట్టంలో స్పష్టంగా వుంది. 2014లో అధికారం లోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేకహోదాను అటకెక్కించినా పోలవరంను మాత్రం చేస్తామంది. అయితే ప్రత్యేకహోదా వద్దని ప్రత్యేక ప్యాకేజీకి మొగ్గుచూపిన చంద్రబాబు, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యతను కూడా తనకే అప్పగించాలని కేంద్రాన్ని కోరాడు. మా నొప్పి మీరు భరిస్తామంటే మాకేం ఇబ్బందని వాళ్ళు అలాగే ఇచ్చేసారు. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా భారీ స్థాయిలో ప్రయోజనాలు ఆశించారు. యధేచ్ఛగా అంచనాలు పెంచుకోవచ్చని, అడిగినంత బిల్లులను కేంద్రం పంపిస్తుందని ఆశపడ్డారు. కాని అక్కడ వుండేది మోడీ... ఇసుకలో నూనె పిండే రకం. స్టీలు రేటెంత, సిమెంట్ రేటెంత... ఆ ప్రాజెక్ట్ కట్టడానికి ఎంత ఖర్చవుతుందన్నది వారికి తెలియకుండా వుం టుందా? ఈ మూడున్నరేళ్లలో పోలవరం అంచనా వ్యయాన్ని 16వేల కోట్ల నుండి 54వేల కోట్లకు తీసుకెళ్లారు. భారీగా అంచనా వ్యయం పెంచడంతో కేంద్రం నిధుల విడుదల విష యంలో ఆచితూచి అడుగులు వేయసాగింది. దీంతో ప్రాజెక్ట్ నిర్మాణం ముందుకు మూడడుగులు, వెనుకకు ముప్పై అడుగులు అన్నట్లుగా మారింది. ఈ మూడేళ్లలో కాపర్‌డ్యాం కూడా కాలేదు. 12వేల కోట్లు ఖర్చుపెట్టామని చంద్రబాబు చెబుతున్నాడు. ఇంకా 42వేల కోట్లు కావాలంటున్నాడు. కేంద్రం ఈయన అడిగినన్ని నిధులు ఇవ్వకపోతుండడంతో ఇప్పుడు నేను చేయలేనంటూ చేతులెత్తేసాడు.

పోలవరం విషయంలో బీజేపీ–టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. కేంద్రప్రభుత్వం సరిగా డబ్బులివ్వలేదని టీడీపీ నేతలు నిందను బీజేపీపై వేయాలని చూస్తున్నారు. కేంద్రం కడతానన్న ప్రాజెక్టును నువ్వెందుకు ఒప్పుకున్నావంటూ ప్రతిపక్షాలు చంద్రబాబును వాయిస్తున్నాయి. కేంద్రం నుండి వస్తున్న డబ్బులతో వైకాపా ఎమ్మెల్యేలను కొంటున్నావు... ఇక పోలవరం ఎక్కడ పూర్తి చేస్తావని బీజేపీ నాయకులు చంద్ర బాబుపై దాడి చేస్తున్నారు. పోలవరం విషయంలో చంద్రబాబు అనవసర ఆత్రాశకుపోయి రాష్ట్రానికే చేటుతెచ్చాడు. పోలవరాన్ని ప్రజలకు వరంగా కాకుండా శాపంగా మారుస్తున్నాడు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న చంద్రబాబు

## - వైకాపా నేతల ఆగ్రహం

ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం చేస్తున్న సిఎం చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. గత నెల 29న నెల్లూరు 9వ డివిజన్‌లోని కుసుమ హరిజనవాడలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ నిర్వహించిన ప్రజాదీవెన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని, వైకాపాకు రాజ్యసభ



'ప్రజాదీవెన'లో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్

సీటు రాకుండా చేసేందుకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి టిడిపిలోకి తీసుకుంటున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతులని, వాళ్ళు తిరగబడే రోజు వస్తుందని చంద్రబాబు గుర్తుపెట్టుకుంటే మంచిదని హెచ్చరించారు. నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ అందరి ఆశీస్సులతో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే చెప్పిన హామీలను తప్పకుండా నెర వేరుస్తారన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీలను అభివృద్ధి చేస్తారన్నారు. చంద్రబాబు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొంటున్నారని, ప్రజలను కొనలేరనే విషయాన్ని గుర్తుపెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఎండి ఖలీల్ అహ్మద్, ఓబిలి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రుడికి అవమానం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌కు ల్యాండ్‌మార్క్ లాంటి ట్యాంక్‌బండ్ నిర్మాత స్వర్గీయ నందమూరి తారకరామారావు. హైదరాబాద్‌లో హైటెక్ సిటిని నిర్మించి హైటెక్ బాట పట్టించింది చంద్రబాబునాయుడు, ఇక దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో అయితే హైదరాబాద్ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. వై.యస్. హయాంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, పి.వి.నరసింహా రావు ఎక్స్‌ప్రెస్ హైవేలతో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి నగర రూపురేఖలు దిద్దుకుంది. ఇక ఇప్పటి మెట్రో ప్రాజెక్ట్‌కు ఆద్యుడు కూడా వైయస్సే! మెట్రో ప్రాజెక్ట్‌ను వై.యస్ తెచ్చాడు. మెట్రోను కేసీఆర్ వ్యతిరేకించాడు. ఆధునిక హైదరాబాద్ నిర్మాణంలో ఆంధ్రుల పాత్ర ఎంతో వుంది. హైదరాబాద్ నగర నగిషీలుగా చెప్పుకునే ఏ ఒక్కదానిలోనూ కేసీఆర్ పాత్ర లేదు.

కాని, నిన్న జరిగిన మెట్రో ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి గాని, అమెరికా అధ్య క్షుడి సలహాదారు ఇవాంకా ట్రంప్ పాల్గొన్న కార్యక్రమానికి గాని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ఆహ్వానించకపోవడం ఆంధ్రులను అవమానించడమే! హైదరా బాద్ ఉమ్మడి రాజధాని. మెట్రో ప్రాజెక్ట్ ఉమ్మడి రాష్ట్రాల హక్కు. ఇంకా ఆరున్న రేళ్ళు హైదరాబాద్‌పై ఆంధ్రులకు హక్కు వుంది. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి కూడా! మరి ఆంధ్రా సీఎంను ఎందుకు గుర్తించలేదు? ఎందుకు గౌరవించలేదు. 2023దాకా హైదరాబాద్ నుండి మనల్ని ఎవరూ కదిలించలేరు, విభజన చట్టమే మనకు ఆ అవకాశమిచ్చింది. కాని చంద్రబాబే ఓటు–నోటు కేసులో ఇరుక్కుని హైదరా బాద్‌ను వదిలేసి వచ్చాడు. ఆయనంటే హైదరాబాద్‌ను వదిలేసినా కేంద్రమన్నా హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వున్న అధికారాన్ని గుర్తించనక్కరలేదా?

ఈ కార్యక్రమాలకు చంద్రబాబును ఉద్దేశ్యపూర్వకంగానే పిలవలేదా లేక ఆయన మీదున్న అనుమానంతో పిలవ లేదా అన్న సందేహాలు కూడా వున్నాయి. ఏ సభలో చూసినా హైదరాబాద్‌ను నేనే అభివృద్ధి చేసానని చంద్రబాబు చెప్పు కుంటుంటాడు. వై.యస్.తో పోలిస్తే హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర చాలా తక్కువ. అయినా డబ్బా కొట్టుకోవడంలో ఆయనే ముందుంటాడు. అలాంటి వ్యక్తిని మెట్రో, ఇవాంకా కార్య క్రమాలకు పిలిస్తే అక్కడకూడా అదే డబ్బా ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వాన్ని కూడా డామినేట్ చేయాలని చూస్తాడు. ఇక ఏ కార్యక్రమంలోనైనా చంద్రబాబును హైలెట్ చేసి చూపించడానికి పచ్చమీడియా రెడీగా వుంటుంది. చంద్రబాబును పిలిస్తే ఇలాంటి పరిణామాలుంటాయని ఊహించే ఆయనను పట్టించుకోలేదని తెలుస్తోంది.

కేసీఆర్, కేటీఆర్‌లు ఈ కార్యక్రమాల విషయంలో నియంతల మాదిరిగా వ్యవహరించారు. హైదరాబాద్ నగరానికి ప్రథమ పౌరుడైన మేయర్ బొంతు రామ్మో హన్‌కు కూడా ప్రాధాన్యత కల్పించక పోవడం వివాదం రేపింది. రాష్ట్రపతి దేశానికి ప్రథమ పౌరుడైతే, గవర్నర్ రాష్ట్రానికి ప్రథమపౌరుడైతే, మేయర్ నగరానికి ప్రథమపౌరుడవుతాడు. ప్రోటో కాల్‌లో మంత్రులకంటే కూడా మేయర్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. అలాంటి మేయర్‌ను కూడా పక్కనపెట్టేశారు. ఏపి సీఎంను పిలవకపోవడం, మేయర్‌ను పక్కన పెట్టడం వంటి సంఘటనలు రాజకీ యంగా వివాదం రేకెత్తిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీరుపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఈ పరిణామాలు ఎలా వున్నా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రికి కేంద్రం గాని, తెలంగాణ ప్రభుత్వం గాని కనీస గౌరవం ఇవ్వకపోవడం, ప్రోటోకాల్ పాటించి ఆయనను ఆహ్వానించకపోవడం ఆంధ్రు లను చిన్నచూపు చూడడమే!

# వరాల వీరులు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయపార్టీల శృతిమించిన హామీలు ఇవి. మనం ఇప్పటివరకు తమిళనాడు ఎన్నికల ప్రచారాలలో మాత్రమే ఇలాంటి హామీలు చూసాం. ఇప్పుడు ఆ రాష్ట్ర సరిహద్దునే వున్న మన రాష్ట్రానికి కూడా ఆ గాలి సోకినట్లుంది. మన రాష్ట్ర నాయకులకు కూడా అక్కడి నాయకుల హామీలు వంటబట్టినట్లున్నాయి. వచ్చే ఎన్నికల్లో ప్రజలపై వరాల జల్లు కురిపించడానికి ప్రధానపార్టీలు సిద్ధమవుతున్నాయి.

2014 ఎన్నికలలోనే తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు నోటికి అడ్డు అదుపు లేకుండా హామీలిచ్చాడు. వాటిలో లక్షకోట్ల పైనే వున్న ఋణమాఫీ ఒకటి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇంకా కొన్ని వందల హామీలను పొందుపరిచారు. అధికారంలోకి వచ్చాక వాటిలో అమలు చేసినవి చాలా తక్కువ. చంద్రబాబులాగా నోటికి ఏదొస్తే అది చెప్పకపోవడం వల్లే జగన్ ప్రతిపక్ష నేతగా మిగిలిపోవాల్సివచ్చింది. జగన్ నోటి నుండి ఒక్క ఋణమాఫీ వాగ్దానం వచ్చివున్నా ఈరోజు చంద్రబాబు, జగన్‌లు ఆపోజిట్ పొజిషన్‌లలో ఉండేవాళ్ళు. కాని, జగన్ అలా హామీలు ఇవ్వకపోవడం, చంద్రబాబు నోటికేదొస్తే అది ఇవ్వడం వల్లే తెలుగుదేశం అధికారంలోనూ, వైసిపి ప్రతిపక్షంలోనూ వుంది. 2014లో చేసిన తప్పులు జగన్ మరోసారి చేయవద్దనుకుంటున్నాడు. ఎన్నికల్లో గెలుపోటములపై హామీలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనిని జగన్ వంట బట్టించుకున్నాడు. మొన్న నంద్యాల ఉపఎన్నికలప్పుడు 'నవరత్నాలు' పేరుతో పలు హామీలు గుప్పించిన జగన్, ఇప్పుడు ప్రజాసంకల్ప పాదయాత్రలోనూ హామీల విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, తాత్కాలిక ఉద్యోగులు, వృద్ధులు, కార్మికులు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, ముస్లింలు, క్రైస్తవులు, పూజారులు, ఇమామ్‌లు, పాస్టర్‌లు... ఇలా ఎవరినీ వదలకుండా వారిని ఆకట్టుకునే రీతిలో హామీలు ఇస్తున్నాడు. 2014లో ఋణమాఫీ అన్నది అసాధ్యమైన పని అని తెలిసి ఆయన ఆ వాగ్దానం చేయలేదు. చంద్రబాబు అది సాధ్యం కాదని తెలిసి కూడా అధికారం లక్ష్యంగా చేసుకున్నాడు కాబట్టి చెప్పేసాడు. అధికారంలోకి వచ్చాక దానిని ఎంత అవతారంగా అమలు చేస్తున్నాడన్నది చూస్తూనే వున్నాం. ఋణమాఫీ లాంటి అసాధ్యమైన హామీనే ఇచ్చిన చంద్రబాబు రేపటి ఎన్నికల్లో ఇంకా పెద్దపెద్ద వాగ్దానాలే చేస్తాడు తప్ప, వెనక్కి తగ్గడు. కాబట్టి వచ్చే ఎలక్షన్‌లలో రాష్ట్ర ప్రజలు ఇరు పార్టీల నేతల హామీల వర్షంలో తడిసి ముద్దవడం ఖాయం.

# అతివలు కాదు... ఆదిపరాశక్తులు

## • భారతీయ స్త్రీ శక్తిని చాటిన హైదరాబాద్ మహిళా పారిశ్రామిక సదస్సు



దక్షిణాసియాలో తొట్టతొలిసారిగా అంతర్జాతీయస్థాయిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సును అత్యంత వైభవంగా జరగడం భాగ్యనగరానికో భాగ్యం. అందులోనూ ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన సదస్సు ఇక్కడ నిర్వహించడం మన తెలుగువారందరికీ ఎంతో గర్వకారణం కూడా. సృజనాత్మకశక్తికి మెరుగులుదిద్ది ప్రతిభకు పట్టాభిషేకం చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో నూతనోత్సాహాన్ని చ్చేందుకు, సరికొత్త ఆవిష్కరణలను మానవాళి ముంగిట ఆవిష్కరించేందుకు ప్రారంభమైన ఈ సదస్సు ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. సకల ప్రపంచాన్నే ఆకట్టుకున్న ఈ సదస్సులో స్త్రీ శక్తి ఎంతటి విలక్షణమైనదో, ఎంత విశిష్టమైనదో ప్రపంచానికి చాటేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ చేసిన మార్గదర్శకాలు ఎంతైనా అనుసరణీయం. 150కి పైగా దేశాల నుంచి విచ్చేసిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, దిగ్గజాలైన వ్యాపారవేత్తలతో భాగ్యనగరం కళకళలాడింది. అటు ప్రధాని మోడీ, ఇటు అమెరికా అధ్యక్షుని సలహాదారు ఇవాంకా ట్రంప్ ఈ సదస్సులోపాల్గొనడంతో సదస్సుకే ప్రపంచస్థాయిలో సమున్నతమైన గౌరవం ఏర్పడింది. ఈ సందర్భంగా అన్నింటా తామై అన్నిరంగాల్లో అత్యంత ప్రతిభాపాటవాలతో ముందుకు సాగుతున్న మహిళలు పారిశ్రామిక రంగంలోనూ అగ్రస్థానంలో నిలుస్తున్న విషయాలను ఇవాంకా ట్రంప్ కన్నులకు కట్టినట్లుగా అత్యద్భుతంగా వివరించడంతో సదస్సులో మహిళాశక్తికి అగ్రపీఠం వేసినట్లయింది.



మహిళాశక్తి ఔన్నత్యాన్ని ఆమె చాటిచెప్పిన తీరుకు అందరి నుంచి హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. మన సమాజంలో ఉన్న అడ్డంకులను తొలగించడానికి అవసరమైన సరికొత్త మార్గాలను కనుగొందాం.. అడ్డంకులు ఎన్నున్నా ఎదుర్కొందాం...ఒకరి నుంచి మరొకరం తెలుసుకుందాం. మహిళలు విజయాలను, సాధికారతను సాధించడానికి, వినూత్న ఆవిష్కరణలు చేయడానికి, మన పిల్లలకు సమున్నతమైన భవితను ఇవ్వడానికి కృషి చేద్దాం... అంటూ ఇవాంకా చేసిన ప్రసంగం ఆద్యంతం అద్భుతంగా ఉండి.. అందరికీ మార్గదర్శకమై నిలిచింది. అమెరికాలో కోటీ పది లక్షల మందికి పైగానే మహిళలు సొంతంగా వ్యాపార వాణిజ్యాలను చేపట్టి 90 లక్షల మందికి ఉపాధి కల్పించడమేకాక, సుమారు లక్షకోట్ల డాలర్ల రాబడిని సృష్టిస్తున్నట్లు ఇవాంకా ట్రంప్ ఈ సందర్భంగా సగర్వంగా ప్రకటించారు కూడా. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యంత వేగంగా ప్రగతిపథంలో పరుగులు పెడుతున్న భారతదేశం మహిళలకు పారిశ్రామిక రంగంలోనూ అండగా నిలవాలన్న ఆమె ఆకాంక్ష సదస్సు ధ్యేయాన్ని మరింతగా ప్రకాశింపజేసింది. అంతేకాదు, మహిళలకు సాధికారత కల్పించకపోతే మానవాళి పురోగతి అసంపూర్తిగా ఉంటుందన్న మాటలను, ప్రధాని విశ్వాసాలను ఇవాంకా ప్రశంసించడం, గత పదేళ్లలో వ్యాపారరంగంలో వినూత్నమైన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడంలో నారీమణులు అత్యంత ప్రతిభావంతగా, విజయవంతంగా ముందుకు సాగుతున్నారంటూ వివరించడం అందరినీ బాగా ఆకట్టుకుంది. అంతేకాదు, వికసిస్తున్న ఆర్థిక వ్యవస్థగా, ప్రజాస్వామ్యానికి దీపశిఖగా, ప్రపంచానికి ఆశాజ్యోతిగా భారత్‌ను తీర్చిదిద్దుతున్న మీకు ధన్యవాదాలు.. అంటూ ఇవాంకా ట్రంప్ మన ప్రధాని మోడీని, భారత్ ప్రగతికై ఆయన చేస్తున్న కృషిని, సాధిస్తున్న విజయాలను ఈ సందర్భంగా ప్రశంసించడం విశేషం.

ఈ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోడీ మాట్లాడుతూ, మన పురాణేతిహాసాల ప్రకారం స్త్రీ అంటే శక్తి అవతారమని, మహిళా సాధికారత అభివృద్ధికి కీలకమని అంటూ మహిళా శక్తిని కొనియాడారు. భారత్ వృద్ధి ప్రస్థానంలో ప్రపంచ పారిశ్రామికవేత్తలంతా భాగస్వాములు కావాలని ప్రధాని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మహిళా శక్తి ఎంతో గొప్పదని, భారతీయ సంస్కృతిలో మహిళలను శక్తి స్వరూపిణులుగా కొలుస్తారన్నారు. సులభతరమైన వ్యాపార నిర్వహణకు వీలుగా తమ ప్రభుత్వం ఇప్పటికే అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించాలని, మహిళలను గౌరవించడం భారతదేశ సంస్కృతి అని అంటూ, భారతీయ మేధస్సు ఈ తరానికి స్ఫూర్తి అన్నారు. మేక్ ఇన్ ఇండియాను అందరూ ప్రోత్సహించాలన్నారు. మూడురోజులపాటు అత్యద్భుతంగా జరిగిన ఈ సదస్సులో కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్, రక్షణమంత్రి నిర్మలా సీతారామన్, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ తదితర ముఖ్యులంతా పాల్గొన్నారు. ప్రత్యేకించి అంకుర సంస్థల్ని మార్కెట్లోకి తీసుకురావడం, పెట్టుబడులు సమకూర్చుకోవడం, ఇంధన రంగం, ఆరోగ్యం, డిజిటల్, మీడియా, వినోదం తదితర రంగాలపై జరిగిన చర్చలు యువతకు మార్గదర్శకంగా నిలిచాయి.

### కృష్ణపట్నం పోర్టులో...

# ఉత్సాహంగా జరిగిన సైలింగ్ పోటీలు



సైలింగ్ క్రీడాకారులతో పోర్టు సి.ఇ.ఓ అనిల్, డిఎస్‌డివో రమణయ్య

నవంబర్ 30వ తేదీన కృష్ణపట్నం పోర్టులో రాష్ట్రస్థాయి సైలింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా ఈ పోటీలు జరిగాయి. నవయుగ సైలింగ్ అకాడమీ నిర్వహణలో యాంటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, యాంటింగ్ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు వారి సహకారంతో నిర్వహించిన ఈ పోటీలను కృష్ణపోర్టు సిఇఓ అనిల్ యండ్లూరి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణయ్య, జిల్లా ఒలింపిక్ కార్యదర్శి పి.రామ్మూర్తి ప్రారంభించారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైలింగ్ కోచ్‌ల ఆధ్వర్యంలో కృష్ణపట్నంపోర్టులో సైలింగ్ శిక్షణ పొందినవాళ్ళు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలురలలో అమాగ్ మొదటి స్థానాన్ని, ఎన్.వినయ్ రెండవ స్థానాన్ని ఇ.విష్ణుకుమార్ 3వ స్థానాన్ని సాధించారు. బాలికల్లో తనిష్కగౌర్ మొదటి స్థానాన్ని, బి.నవ్య రెండవ స్థానాన్ని, ఎన్.వైష్ణవి మూడోస్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా సి.ఇ.ఓ అనిల్ మాట్లాడుతూ సైలింగ్ వలన ఇండియన్ నావీలో ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపారు. అలాగే ఈ ప్రాంతం టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి కృష్ణపట్నం పోర్టు ఎంతగానో కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఇక్కడ అంతర్జాతీయ సైలింగ్ పోటీల నిర్వహణతో పాటు సైలింగ్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో సైలింగ్‌లో మనవాళ్ళు ఒలింపిక్ పతకాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నంపోర్టు పి.ఆర్ హెడ్ గంటా వేణుగోపాల్, రవీంద్ర, ఏ.పి సైలింగ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ గౌడ్, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

### ఈ నెల్లో జాతీయ స్థాయి సైలింగ్ పోటీలు

కృష్ణపట్నంపోర్టు కేంద్రంగా ఈ నెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు జాతీయ స్థాయి సైలింగ్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే డిసెంబర్ 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు అంతర్జాతీయ సైలింగ్ పోటీలను నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 500మంది వరకు క్రీడాకారులు రానున్నారు. అలాగే అంతర్జాతీయ పోటీలకు సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, శ్రీలంక, ఇరాన్, జర్మని, యుకె, హాంకాంగ్ వంటి దేశాల నుండి 250మంది సైలింగ్ క్రీడాకారులు హాజరు కానున్నట్లు తెలుస్తోంది.








Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com